

వడ్డేపల్లి కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో ఖాళీ కుర్చీలు

# సార్లు... సమయానికి రారు

## ఎంపీడీఓ కార్యాలయంలో ఇష్టారాజ్యం

**వడ్డేపలి, జూలై 4 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలోని అధికారులు విధులకు ఎప్పుడు వస్తారో ?ఎప్పుడు వెళ్తారో? ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది.ఒక మండల స్థాయి అధికారే సమయపాలన పాటించడం లేదు. దీంతో క్రింది స్థాయి అధికారులు మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పెద్దసారే సమయానికి రారు ఇక మమ్మల్ని అడిగేదెవరు అన్న చందంగా అక్కడ పరిస్థితి తయారయ్యింది. అధికారులు విధులకు సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆయా పనుల నిమిత్తం సంబంధిత అధికారులను కలిసేందుకు కార్యాలయానికి వచ్చిన పలువురు చర్చించుకుంటున్నారు. అధికారులు సమయపాలన లేదు అందుకు నిదర్శనమే శుక్రవారం మధ్యాహ్నం 12:50 నిమిషాల సమయం అయినా.. సంబంధిత అధికారులు ఒక్కరూ కూడా కార్యాలయానికి రాలేదు. దీంతో ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు లేకుండా ఇలా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. మండల స్థాయి అధికారులు సమయపాలన పాటించడం లేదని పని నిమిత్తం అధికారులను కలిసేందుకు వస్తే ఎవరూ లేకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దీనిపైన జిల్లా ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# దొడ్డి కొమురయ్య స్ఫూర్తి కొనసాగిద్దాం

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**దొడ్డి కొమురయ్య చిత్రపటానికి ఘన నివాళి**



దొడ్డి కొమరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 4 ప్రభాతవార్త:** దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని కొనసాగిద్దామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమానికి కలెక్టర్ విజయేంద్ర బోయితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య తెలంగాణ తొలి అమరుడు అని ఆయన చెప్పారు. తెలంగాణ కోసం వారు చేసిన ఆత్మ త్యాగంతో కులమతాలకు అతీతంగా అందరూ ఏకమై భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం తిరుగుబాటు చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ నాయకులు రాషెద్ ఖాన్, ఖాజా పాషా, శాంతన్న యాదవ్, శ్రీశైలం, ప్రవీణ్ కుమార్, సరోజ, డివైఎస్ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జ్యోతిబా పూలే, గురుకుల పాఠశాల తనిఖీ

**అదనపు గదులను నిర్మించాలని కలెక్టర్‌ను కోరిన ప్రిన్సిపల్**

**పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచన**



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

**నారాయణపేట ప్రతినిధి, జూలై 4 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని కోటకొండకు సంబంధించిన పీఎం శ్రీ మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తనిఖీ చేశారు. ముందుగా కోటకొండ రెసిడెన్షియల్ పాఠశాలకు వెళ్లిన కలెక్టర్ ఆపాఠశాల ప్రిన్సిపల్ శ్రీలతతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల సంఖ్య, విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు,స్నానపు గదులు ఉన్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు లేవని, అద్దె భవనం కావడంతో యజమానిని అదనపు గదులను నిర్మించాలని కోరినట్లు ప్రిన్సిపల్ కలెక్టర్‌కు తెలిపారు. అక్కడే ఉన్న భవన యజమానితో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థినిల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అదనపు గదులను నిర్మించాలని యజమానికి కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు వస్తాయని అంతలోపు మీరు అదనపు గదులను నిర్మించాలని యజమానికి చెప్పారు. పాఠశాలలోని పలు తరగతి గదులకు వెళ్లిన కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడారు. పదో తరగతి గదిలోకి వెళ్లిన కలెక్టర్ గతేడాది సాధించినట్టు ఈ సారి కూడా వంద శాతం ఫలితాలు సాధించాలని సూచించారు. 600లకు 600 మార్కులు ఎవరెవరు సాధిస్తారని విద్యార్థినులను ప్రశ్నించగా అందరం 600మార్కులు తెచ్చుకుంటామని - మిగతా4లో..




# ప్రజలకు దూరంగా ప్రజాపాలన

- నేతలకు అందలం... ప్రజలకు వందనం...
- పైసలు పెట్టు... ఫైల్ పట్టు



**వంగూరు, జూలై 4 ప్రభాతవార్త:** నిత్యం ప్రజా పనులతో కిటకిటలాడే మండల రెవెన్యూ కార్యాలయం అవినీతికి, అధికార పార్టీ నాయకుల పైరవీలకు అడ్డాగా మారుతుంది. ఏ పని చేయాలన్న ఫైల్ కదలాలన్నా రేటు కుదుర్చుకుంటూనే పనులు నడుస్తుండడం గమనార్హం. ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత మండలం అయిన వంగూరు మండల రెవెన్యూ కార్యాలయ దుస్థితి... సీఎం సొంత మండలంలో ఇలా ఉంటే మిగతా మండలాల పరిస్థితి ఏంటో చెప్పకనే చెప్పవచ్చు. మండలంలో కంప్యూటర్ ఆపరేటర్లు చేయాల్సిన లాగిన్లు పై అధికారుల వద్దనే పెట్టుకొని వసూళ్ల దందా నడుపుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. నూతన రేషన్ కార్డుల జారీ కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, భూముల రిజిస్ట్రేషన్‌లో గైరాన్ భూములు తదితర పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు బాహాటంగానే విమర్శలు వెలుగుతున్నాయి.

### పైసలు పెట్టు... రేషన్ కార్డు పట్టు...

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రజా పాలన కార్యక్రమం ద్వారా నూతన రేషన్ కార్డుల జారీ చేపడుతుంది. గతంలో నిర్వహించిన ప్రజాపాలన సభలలో ప్రజలు తమకు కావాల్సిన రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు, ఉచిత కరెంట్ అందిచాలని దరఖాస్తు చేసుకుంటే అర్హతను బట్టి అర్హులకు అందిస్తామని ప్రభుత్వం హామీస్తే అధికారులు మాత్రం ప్రభుత్వ ఆదేశాలను భేఖతర్ చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడంతో మళ్ళీ మీసేవ కేంద్రాలలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోని మండల రెవెన్యూ కార్యాలయంలో మీసేవ కేంద్రాలలో ధరఖాస్తు చేసిన దరఖాస్తులను అందించాల్సి వస్తుంది. కాగా లబ్ధిదారులు రేషన్ కార్డు కావాలని మీసేవ కేంద్రాలలో ధరఖాస్తు చేసుకొని, మండల కార్యాలయానికి వచ్చి ధరఖాస్తు చేసిన దరఖాస్తులను అధికారులకు అందిస్తే రూ.500 వసూలు చేసి రేషన్ కార్డులు జారీ చేస్తున్నట్లు సమాచారం. కంప్యూటర్ ఆపరేటర్ల వద్ద ఉండాల్సిన లాగిన్ పాస్వర్డ్ పై అధికారులు తమ వద్ద పెట్టుకొని డబ్బులు ముడితేనే కార్డులు జారీ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాల జారి సమాచార సంబంధిత దరఖాస్తులు అర్హత ఉన్నప్పటికీ చేయి తడిపితే గాని పనులు కావడం లేదని మండల వాసులు వాపోతున్నారు.



రేషన్ కార్డుల దరఖాస్తులు అందించడానికి లైన్‌లో నిల్చున్న లబ్ధిదారులు

### అధికార పార్టీ నేతల పైరవీల జోరు....

ప్రజా సమస్యల దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించాల్సిన మండల అధికారులు కేవలం కొంతమంది అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అధికార పార్టీ నేతలు ఏది చెబితే అదే అన్నట్లుగా ప్రభుత్వ భూముల లావాదేవీల, ఇతర భూ సంబంధిత లావాదేవీలు విచ్చలవిడిగా జరుగుతున్నట్లు సమాచారం. సాధారణ ప్రజల గోడు వినిపించేందుకు కనీస సమయం కేటాయించలేని మండల అధికారులు అధికార పార్టీ నాయకుడికి తమ చాంబర్లో ప్రత్యేక అతిథి మర్యాదలు కల్పిస్తూ వారి అడుగులకు మడుగులు వేయడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### కనుమరుగైన పౌర పట్టికలు.. పని వేళలు పట్టని అధికారులు..

దేశంలోని ఏ ప్రభుత్వ కార్యాలయమైన పౌర పట్టికలు, పనివేళలు, ప్రదర్శించడం తప్పనిసరి. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత మండల కార్యాలయాల్లో మాత్రం అలాంటివి మచ్చుకైనా కనిపించవు. ఒకవేళ కనిపించినప్పటికీ అధికారులు పాటించిన పాపాన లేదు. ఏ పనికి ఎంత సమయం పడుతుంది, కార్యాలయ పనివేళలు, సమాచారం ప్రతి కార్యాలయంలో పౌరులకు అందుబాటులో ఉంచాలి. కానీ వంగూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో మాత్రం ఎక్కడ కనిపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

### రేషన్‌కార్డు జారీ చేయడానికి ఇబ్బందులు పెడుతున్నారు..



నూతన రేషన్ కార్డు మంజూరు చేయాలని ప్రజా పాలనలో ధరఖాస్తు చేసుకున్నప్పటికి అనాటి ధరఖాస్తు ఫారాలు ఎక్కడ వేశారో తెలియదు. నూతనంగా రేషన్ కార్డు మంజూరు చేయాలని తహసీల్దార్ కార్యాలయంలోని అధికారులను కోరగా మీ సేవ కేంద్రాల్లో ధరఖాస్తు చేసుకొని ధరఖాస్తు చేసిన ఫారంను కార్యాలయంలో అందించాలన్నారు. ధరఖాస్తు చేసుకున్న ఫారంను కార్యాలయంలోని అధికారులకు అందించినప్పటికి సంతకాలు పెట్టే విషయంలో ఇబ్బందులకు గురి చేస్తూ కార్యాలయం చుట్టు తిప్పుతున్నారు.

*మల్లేష్‌గౌడ్, వంగూరు గ్రామానికి చెందిన లబ్ధిదారుడు*

# దరఖాస్తులను పరిష్కరించడంలో వేగం పెంచాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

- వరదలు వస్తే ఎలాంటి ప్రాణ నష్టం జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- రెవెన్యూ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

**వనపర్తి, జూలై 4 ప్రభాతవార్త :** భూ భారతి చట్టం ప్రకారం రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి తహశీల్దార్లు, డిటిలు, కంప్యూటర్ ఆపరేటర్లతో రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో రెవెన్యూ సదస్సులను చాలా బాగా నిర్వహించారని అందుకు రెవెన్యూ సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. రెవెన్యూ సదస్సు ద్వారా వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 15 నాటికి ఏ ఒక్క దరఖాస్తు పెండింగ్ లేకుండా చూసుకోవాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు ఉన్నట్లు తెలిపారు. అందువల్ల వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని అవసరమైన వారికి వెంటనే నోటీసులు పంపించాలని సూచించారు. చాలా దరఖాస్తులు తహసిల్దార్ లాగిన్ లోనే పరిష్కరించవచ్చని వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఆర్డీఓ లాగిన్‌కు పంపించాల్సింది ఆర్డీఓ కు మిగిలినవి కలెక్టర్ లాగిన్‌కు పంపించాలని ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను ఫార్మెట్ 1, ఫార్మెట్ 2గా విభజించుకోవాలని, అర్హత ఉన్న అన్ని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి తాత్కాలిక ఆమోదం తెలపాలని సూచించారు. అన్ని దరఖాస్తులకు తప్పకుండా రికార్డులు పెట్టాలని, ఒకవేళ ఏదైనా దరఖాస్తును తిరస్కరించాల్సి ఉంటే స్పీకింగ్ ఆర్డర్ ద్వారా తిరస్కరించి దరఖాస్తు దారుకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను పరిష్కరించే ప్రక్రియ వేగవంతం చేయాలని, రోజువారీగా పరిష్కరించిన దరఖాస్తుల వివరాలు సాయంత్రం 5 గం.లలోపు తనకు నివేదిక పంపించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం చర్యలు కటినంగా ఉంటాయని హెచ్చరించారు. రేషన్ కార్డు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, ప్రజాపాలన ద్వారా, మీసేవ ద్వారా కొత్త రేషన్ కార్డుల మంజూరు కొరకు వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. జులై 14న ప్రభుత్వం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు జారీ చేయబోతోందని అందువల్ల తహసిల్దార్ లాగిన్‌లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సర్వే చేసి త్వరగా పరిష్కరించాలని, జూలై 10 లోగా అర్హత ఉన్న దరఖాస్తులను ఆమోదించి, మిగిలిన వాటిని తిరస్కరించాలని, పెండింగ్ మాత్రం ఉంచుకోవద్దని సూచించారు. వరదలు వస్తె ఎలాంటి ప్రాణ నష్టం జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి కృష్ణ నది పరివాహక ప్రాంతంలోని మండలాల తహసీల్దార్లు వరదలు వస్తే ఎదుర్కోవడానికి సర్వం సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఇప్పటికీ ఇచ్చిన మార్గదర్శకాలు తూచా తప్పకుండా పాటించి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అందరూ స్థానిక హెడ్ క్వార్టర్లో ఉండాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం, సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, తహశీల్దార్లు, డిటిలు, కంప్యూటర్ ఆపరేటర్ లు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై సమావేశం

- 13 జెడ్పీటీసీలు, 136 ఎంపీటీసీ స్థానాల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

**నారాయణపేట ప్రతినిధి, జూలై 4 ప్రభాతవార్త :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని వీసీ హాల్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచి ఎన్నికలు ఎప్పుడూ వచ్చినా ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో శైలేష్ కుమార్ జిల్లాలో మొత్తం 13 జెడ్పీటీసీలు,136ఎంపీటీసీ స్థానాల ఎన్నికల - మిగతా4లో..

# గురుకులాల్లో విద్యా ప్రమాణాలపై పరిశీలన

- విద్యార్థులతో ప్రత్యక్షంగా ముచ్చటించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్
- విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక ఆదేశాలు
- విద్యార్థుల 100% ఉత్తీర్ణతకు కృషి చేయండి
- గురుకుల పాఠశాలల్లో శానిటేషన్, వసతులపై ప్రత్యేక దృష్టి



గురుకులంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 4 ప్రభాతవార్త:** తెల్కపల్లి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర, మరియు బాలికల సాంఘీక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలను శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గురుకులాల్లో అందించే వసతులు, ఉపాధ్యాయుల హాజరు,భోజనసౌకర్యం తదితర అంశాలను పరిశీలించి, విద్యార్థుల సమస్యలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ నేరుగా విద్యా ర్థులతోనే ఆరా తీశారు. బియాన్ని పరిశీలించి, బియ్యం, ఇతర సరఫరా స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. వండే బియ్యాన్ని ఒకరోజు ముందే శుభ్రం చేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని, తాజా కూరగాయలనే వినియోగించాలని వంట మనుషులకు కలెక్టర్ సూచించారు. విద్యార్థులతో ప్రత్యేకంగా కలెక్టర్ ముచ్చటించారు. భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటు న్నారని, మీ ఆశయం ఏమిటని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించాలి, సబ్జెక్టులో వారీగా ప్రశ్నలను అడిగి విద్యార్థులతో రాబట్టారు. గురుకులాల్లో పాఠశాలలో ఏవైనా సమస్యలుంటే పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రిన్సిపల్‌లను ఆదేశించారు. పాఠశాలలో చదువులు, వసతులు, సమస్యలు తదితర అంశాలను నిశితంగా కలెక్టర్ పరిశీలించారు.వర్షాకాలం అయినందున విద్యార్థులకు విష జ్వరాలు ప్రబలకుండా సరైన శానిటేషన్ పాటించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మాట్లాడేలా అవకాశం కల్పించి, కొత్తగా ఏర్పాటు చేసిన టెలిఫోన్ సదుపాయాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు ఏ.ఏ సమయంలో ఫోన్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అనేక రకాలుగా వసతులు కల్పించిందని, ఈ అవకాశాల ను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, రాష్ట్ర ప్రభుత్వ, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో రాణించాలని కలెక్టర్ సూచించారు. గత సంవత్సరం 10 తరగతి, ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా కలెక్టర్ ప్రిన్సిపల్ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సంవత్సరం కూడా 100 శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఏఆర్ లక్ష్మికి సూచించారు. డ్రైనేజీ, టాయిలెట్స్, కిచెన్ షెడ్ తదితర పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. గురుకులంలో అవసరమైన మూత్రశాలల నిర్మాణాల పనులు చేయించుకోవాలని, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో విద్యార్థినిలు, ఉపాధ్యాయులతో కలిసి కలెక్టర్ మొక్కను నాటారు. జిల్లా కలెక్టర్ వెంట ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# కొమరయ్య పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం



దొడ్డి కొమరయ్య చిత్ర పటానికి నమస్కరిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాలటౌన్,జూలై4, ప్రభాతవార్త:** తెలంగాణ సాయుధ పోరాట తొలిఅమరుడు దొడ్డికొమురయ్య పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శమని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు -మిగతా4లో..

## స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం

**టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్**

**మహబూబ్‌నగర్, జూలై 4 ప్రభాతవార్త:** జర్నలిస్టుల సమస్యలకు స్థానిక ఎమ్మెల్యే స్పందన లేదని, మరీ ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తారని టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ ప్రశ్నించారు. టిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం జోక్యం కలుగజేసుకుని అర్హులైన ప్రతి జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండు చేశారు. తొందరగా పరిష్కరించకుంటే రిలే దీక్షలను రాష్ట్రం మొత్తం కూడా ప్రజా ఉద్యమంగా చేస్తాం అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకిటి అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి మొలకలపల్లి గోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్, నాయకులు, జాతీయ నాయకులు మొయిజుద్దీన్, పసుపుల శ్రీనివాస్, అలీముద్దీన్, వార్త ఫోటోగ్రాఫర్ రఘు, కృష్ణ, సుందర చారి, రమణ పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న బండి విజయ్

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ఊర్కొండ, జూలై 4 ప్రభాతవార్త:** ఊర్కొండ మండలంలోని తిమ్మన్నపల్లి గ్రామానికి చెంది న సల్వాది బాలమ్మ అనారోగ్యంతో బాధప డుతు గురువారం మృతి చెందింది. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న జకినాలపల్లి గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తలసాని అనిల్ రెడ్డి మృ తురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతా పం తెలిపారు. అనంతరం తన వ్యక్తిగతంగా కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.5వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాతర్ల తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు భాషమోని రామంజనేయులు, మాజీ వార్డు మెంబర్ సల్వాది శేఖర్, నాయకులు గంజీ యాదయ్య, పాతర్ల చంద్రశేఖర్, భాషమోని శ్యామ్, ఆవుల శేఖర్, జిద్దు కృష్ణయ్య, పాతర్ల రంజిత్ తదితరులు ఉన్నారు.

## సభకు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు

**నవాబుపేట, జూలై 4 ప్రభాతవార్త :** కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) తీసుకున్న జైబాపూ, జైభీమ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎల్బీ స్టేడియంలో టీపీసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ గ్రామ కమిటీల అధ్యక్షుల సమ్మేళన సభకు నవాబుపేట కాంగ్రెస్ మండల గ్రామ అధ్యక్షుల సభకు నవాబుపేట మండల కేంద్రం నుండి బయలుదేరారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సభకు కాంగ్రెస్ గ్రామ కమిటీల అధ్యక్షులు హాజరు కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్యఅతిథిగా పాల్గొనిజై బాపూ, జై భీమ్ కార్యక్రమానికి సంబంధించి గ్రామ కమిటీల అధ్యక్షులకు దిశానిర్దేశం చేస్తారు. ఈ సభలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ముఖ్యనేతలు పాల్గొంటారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ గ్రామకమిటీల అధ్యక్షులతో తొలి సభను తెలంగాణలో నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నీరటి రామచంద్రయ్యతో పాటు మండల నాయకులు, గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.



హైదరాబాద్ సభకు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు**

**నవాబుపేట, జూలై 4 ప్రభాతవార్త :** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి పరిశుభ్రత పాటించాలని నవాబుపేట వైద్యులు డా.శ్రవణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎన్మనగండ్ల గ్రామంలోని బీసీ బాలికల హాస్టల్లో అవగాహన కల్పించి విద్యార్థినిలకు వైద్య చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా డా. శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వంట వండే సిబ్బంది తీసుకో వాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. నీరు నిలవకుండా చూసుకోవాలని వార్డెన్ బందమ్మకు సూచించారు. దోమలు కుట్టకుండా చూసుకోవాలని, విద్యార్థులందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ బాలమ్మ, శరభ లింగం, శ్రీనివాస్ హెల్త్ అసిస్టెంట్, స్థానిక ఏఎన్ఎం కేజియా ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్

## సభకు బయలుదేరిన దేవరకద్ర ఎమ్మెల్యే

**దేవరకద్ర, జూలై 4 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కేడర్‌కు ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే దిశా నిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో ఎల్బీ స్టేడియంలో గ్రామస్థాయి నేతల సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులతో నిర్వహిస్తున్న సామాజిక న్యాయ సమరభేరి సభకు దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన పెద్ద ఎత్తున తరలివెళ్లిన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, తదితరులు నాయకులు వెళ్లారు. అనంతరం దేవరకద్ర ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు చేపట్టాల్సిన అంశాలు, పార్టీ కేడర్‌కు తీసుకోవాల్సిన పటిష్టత గురించి గ్రామస్థాయి, నాయకులకు ఖర్గే సూచనలు చేయనున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ అన్నారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, వివిధ మండలాల అధ్యక్షులు, గ్రామాల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ సభకు వెళ్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## సమస్యలపై చైర్మన్‌ను నిలదీసిన పాఠకులు

**గద్వాల టౌన్, జూలై 4, ప్రభాత వార్త:** జోగులాంబ గద్వాల జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ను వివిధ సమస్యలపై పాఠకులు నిలదీశారు. జిల్లా గ్రంథాలయంకు మౌలిక వసతులు లేక పాఠకులు నానా అవస్థలు పడుతున్నామని, జిల్లా గ్రంథాల చైర్మన్ ఏమి పట్టించుకోవడంలేదని పాఠకులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసుడు గ్రంథాలయం దగ్గర వుండగా ఆయనను పాఠకులు నిలదీశారు . టాయిలెట్స్ లేక అరకొరగా ఉన్న టాయిలెట్స్ లకు నీళ్లు లేక దుర్వాసన వెలువడుతుందని, వాసనకు వెళ్లాలంటే వాంతులకు వస్తున్నాయని, చైర్మన్‌ను నిలదీశారు. జిల్లా గ్రంథాలయాన్నికి మౌలిక వసతులపై మీరు ఏం పట్టించుకోవడంలేదని, పేదవిద్యార్థులు పైచదువుల కోసం చదువుకోవడానికి జిల్లా గ్రంథాలయానికి వివిధ గ్రామాల నుండి వచ్చి ప్రిపేర్ కావడానికి వచ్చిన పాఠకులు చాలా ఇబ్బందులు పడుతున్నారని పాఠకులు చైర్మన్‌ని అడిగారు. చైర్మన్ సరైన సమాధానం చెప్పలేక వాగ్వివాదం చోటుచేసుకుంది. బిఆర్ ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ కురువ పల్లయ్య పాఠకుల పక్షాన చైర్మెన్ తో మాట్లాడగా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో పాఠకులు సద్దుమణిగారు.



పాఠకులు, చైర్మన్ మధ్య నెలకొన్న వాగ్వివాద దృశ్యం

## ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి,రోశయ్య జయంతి

**మల్దకల్ జులై 4, ప్రభాతవార్త:** జోగులంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం దొడ్డి కొమురయ్య వర్ధంతి,మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని ఘనంగా జరుపుకున్నారు. వారి చిత్రపటాలకు ఇన్చార్జి తాసిల్దార్ ఝాన్సీ రాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం వీరోచితంగా పోరాడిన తెలంగాణ రైతన్న సాయుధ పోరాట యోధుడుదొడ్డి కొమురయ్య ఆ మహనీయునికి ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సేవలు చేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరిడెంట్ పెద్ద నరసన్న,సీనియర్ అసిస్టెంట్ సూర్య ప్రకాష్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కరీం,ఆర్ ఐ మహేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న తహసీల్దార్

## ప్రతిష్టాత్మకంగా చెంచు గిరిజన విద్యార్థులకు

# విద్య,అభివృద్ధి కార్యక్రమాలు

- గిరిజన చెంచు ఇండ్ల, ఆశ్రమ పాఠశాలల్లో మౌళిక వసతులపై సమీక్ష,
- చెంచు గ్రామాల్లో ఇండ్ల నిర్మాణాన్ని పారదర్శకంగా చేపట్టాలి...
- గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య, వసతులకోసం ప్రత్యేక చర్యలు...
- విద్యార్థుల సంఖ్య పెంపు, విద్యా ప్రమాణాల మెరుగుదలపై కలెక్టర్ దృష్టి

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 4 ప్రభాతవార్త:** ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలని, చెంచుపెంటల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో చెంచుల ఇండ్ల నిర్మాణాలు, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యా సదుపాయాలపై ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి రోహిత్ గోపిడితో కలిసి ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్, వార్డెన్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, అధికారులతో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలోని 8 మండలాల పరిధిలో ఉన్న చెంచు గ్రామాల చెంచు ప్రజలకు శాశ్వత గృహాల మంజూరు నిర్మాణానికి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. చెంచు పెంటల్లో ఇదివరకే గుర్తించిన అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్ల నిర్మాణాల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చెంచులు ఎవరు కూడా శాశ్వత గృహాలు లేకుండా ఉండరాదని, రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంగా ఇండ్ల నిర్మాణ ప్రక్రియలను చేపట్టిందని, అదే స్ఫూర్తితో జిల్లాలో అధికారులు పనిచేయాలని ఆదేశించారు. అదే విధంగా జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాల లు, వసతిగృహాల్లో మౌళిక సదుపాయాలు, పారిశుధ్యం తదితర సమస్యలను గుర్తించడానికి ఒక్కొక్క వసతి గృహానికీ ఒక ప్రత్యేక అధికారి నియమించామన్నారు. ఆశ్రమ, గిరిజన వసతి గృహాలను తప్పనిసరిగా ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ ఆదేశించారు. చెంచు గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రిన్సిపల్‌లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని, అప్పాపూర్ చెంచు పెంటలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, పాఠశాలలో 30 మంది విద్యార్థుల నుండి 110 మంది విద్యార్థుల నమోదుకు కృషి చేశారని, అన్ని ఆశ్రమ గిరిజన వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. నాగర్‌కర్నూలు జిల్లాలోని 15 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 2893 మంది విద్యార్థులు, 9 గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో 1835 మంది విద్యార్థులు, 9 కళాశాల గిరిజన వసతి గృహాల్లో 600 విద్యార్థులు చదువుతున్నారని, విద్యార్థులకు అందరికీ పాఠ్య పుస్తకాలు, 4 జతల ఏకరూప దుస్తులు, నోటు పుస్తకాలు, దుప్పట్లు, టవల్స్ ట్రంకు బాక్సులు, షూలు, తదితర పరికరాలను పంపిణీ చేశారా లేదా అని పాఠశాల వారీగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా జిల్లాలోని గిరిజన చెంచు విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచాలని, అందుకు అనుగుణంగా ప్రిన్సిపల్‌లో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్య అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తుందని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు ప్రిన్సిపల్ కృషి చేయాలని సూచించారు. తను ఆకస్మిక తనిఖీలు చేపడతానని, తనిఖీ సందర్భంలో విద్యార్థుల నమోదులో వ్యత్యాసాలు ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.




సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

## జూరాల ప్రాజెక్టు నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం

**అమరచింత జూలై 4, ప్రభాతవార్త:** జూరాల ప్రాజెక్టు నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, జాన్ వెస్లీ అన్నారు. శుక్రవారం అమరచింత మండలంలోని జూరాల ప్రాజెక్టు గేట్ల రోప్ వేలను పరిశీలించారు. అనంతరం జూరాల ప్రాజెక్టు అధికారులను గేట్ల రోప్ వేల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సిపిఎం తెలంగాణ రాష్ట్రకార్యదర్శి,జాన్‌వెస్లీ మాట్లాడుతూ, జూరాల ప్రాజెక్టు ప్రమాదంలో ఉన్న రాష్ట్రప్రభుత్వం అధికారులతో కుమ్మక్కై మభ్య పెట్టడానికి ప్రయత్నిస్తుందని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత జిల్లా లో జూరాల ప్రాజెక్టును ప్రమాదం ఉందని తెలిసినా సందర్శించకపోవడం అనుమానాలకు తావిస్తుందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి వెంటనే జూరాల ప్రాజెక్టును సందర్శించి నిజాలను బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. జూరాల ప్రాజెక్టు నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం 17 కోట్లు కేటాయించడం అన్యాయమని కేటాయించిన నిధులను కూడా అధికారులు దుర్వినియోగం చేశారని ఆయన అన్నారు. ఏడాదికి ఒకసారి జూరాల గేట్లకు గ్రీస్ వెయ్యకుండా అధికారులు తూతూ మంత్రంగా నిర్వహణ చేస్తున్నారని అలాగే లీకేజ్ పనులు చేయడంలో పూర్తిగా ప్రభుత్వం లోపంఉందని ఆయన అన్నారు. జూరాల ప్రాజెక్టు నిర్మించినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులో పూడిక పనులు చేపట్టకపోవడం వలన రెండు టీఎంసీల నీరు వృధాగా పోతుందని వెంటనే ప్రభుత్వం జూరాల ప్రాజెక్టులో పూడిక పనులు చేపట్టాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి, ఉత్తంకుమార్ రెడ్డి జూరాల ప్రాజెక్టును సందర్శించి జూరాలకు ఎలాంటి ముప్పు లేదని ప్రకటించడం హాస్యాస్పదమని వెంటనే ప్రభుత్వం జల వనరుల నిపుణులతో పర్యవేక్షణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. జూరాల ప్రాజెక్టు భద్రతపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే కలిసి వచ్చే రాజకీయ పార్టీల తో కలిసి ఆందోళనకు సిద్ధమవుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి, పుట్ట ఆంజనేయులు, రైతు సంఘం జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, సిపిఎం రాష్ట్ర నాయకులు, జబ్బర్, మహమూద్, వెంకటస్వామి, జిఎస్ గోపి, బి వెంకటేష్, బాల్ రెడ్డి, మండ్ల రాజు, కురుమూర్తి, ఎస్ రాజు, ఆర్ఎన్ రమేష్, సిపిఎం శ్రేణులు పాల్గొన్నారు.



సిపిఎం శ్రేణులతో కలిసి నిరసన తెలుపుతున్న జాన్ వెస్లీ

## రోశయ్య చూపిన సామర్థం అందరికీ ఆదర్శం: కలెక్టర్

**గద్వాలటౌన్,జూలై4, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆర్థిక పరిపాలనలో కొణిజేటి రోశయ్య చూపిన సామర్థం అందరికి ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్‌బి.యం సంతోష్ అన్నారు. శుక్రవారం ఐడీఓసీ ఆవరణలో కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ప్రజలపై ప్రేమ, పరిపాలనపై శ్రద్ధ, పని పట్ల నిబద్ధత,ఇవన్నీ ఆయన వ్యక్తిత్వానికి ఆయుధాలుగా నిలిచాయని అన్నారు. రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వంలో 16 సార్లు ఆర్థిక శాఖ మంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టి అరుదైన ఘనత సాధించారని తెలిపారు. ఆయన ప్రజాసేవకు గౌరవంగా,ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని అధికారిక కార్యక్రమంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఆర్థిక రంగంలో స్థిరత్వాన్ని తీసుకురావడంలో ఆయన కీలక భూమిక పోషించారని తెలిపారు. ప్రతి బడ్జెట్ ఉపాధి, ఆరోగ్యం,విద్య,వైద్య,వృద్ధి లక్ష్యాలను కలగలిపే చక్కటి రోడ్‌మ్యాప్‌గా రూపొందించేవారని తెలిపారు. ఆయన నిజాయితీ, క్రమశిక్షణ,నిరాడంబరత, సమర్థత, ప్రజాసేవలో అంకితభావంతో సామాన్య స్థాయిలో నుంచి అత్యున్నత స్థానాలకు ఎదిగిన కొణిజేటి రోశయ్య జీవితం ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ,నర్సింగ రావు, ఏ.ఓ భూపాల్ రెడ్డి ,ఈ.డి ఎస్సీ కార్పొరేషన్ నిషిత,జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్,జి.యం ఇండస్ట్రీస్ రామ లింగేశ్వర్ గౌడ్,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోశయ్య చిత్ర పటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ సంతోష్

## స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందాం

**ఖిల్లా ఘనపురం. జులై 4. ప్రభాతవార్త:** రాబోయే స్థానిక ఎన్నికలలో బిఆర్ఎస్‌పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామని వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, తాజా మాజీ ఎంపీపీ కృష్ణా నాయక్ అన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో టిఆర్ఎస్ కార్యకర్తలను సమయత్వం చేయడానికి సమావేశాలను నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. శుక్రవారం పర్వతాపూర్ మామిడిమడ గ్రామాలలో కార్యకర్తల సమావేశాలలో పాల్గొని రాబోవు సర్పంచ్ ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ నాయకులను ఎన్నుకోవాలని సూచించారు గత శాసనసభ ఎన్నికలలో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నో మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం చేతగాక కొన్ని పథకాలు అంతంత మాత్రమే చేస్తూ ఇచ్చిన హామీలు భాగంగా ఎన్నో పథకాలను ప్రారంభించి పూర్తి చేయకపోవడంతో గ్రామాలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసపూరితమైన వాగ్దానాలను అర్థం చేసుకున్నారని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి సిద్ధంగా ఉన్నారని చెబుతున్నారని బి ఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించాలని తెలియజేశారు. కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని, 2000 పెన్షన్లు 4000 చేస్తామని, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు 2500 అందజేస్తామని, రైతులకు ఏటా 15 వేల రైతు పెట్టుబడి అందజేస్తామని ఇలా అనేక పథకాలు అమలు పరచకుండా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే ఓటమిపాలమైతామనే భయంతో వాయిదాలు వేస్తూ వస్తోందని ఎన్నికలప్పుడే రైతు పెట్టుబడి అంటూ ఇందిరమ్మ ఇళ్లంటూ అనేక పథకాలను ముందుకు తీసుకు వస్తున్నారని వీటిని ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు. అన్ని గ్రామాలలో బి ఆర్ఎస్ జెండా స్థానిక సంస్థల ఎన్నికలలో అన్నిగ్రామాలలో ఎగురవేయాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య సీనియర్ నాయకులు రంగారెడ్డి రాజేందర్ రెడ్డి భాస్కరాచారి మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు గౌడ్ రవీందర్ గౌడ్ నాగన్న పరశురాం సురేందర్ పర్వతాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుదర్శనాచారి భూమయ్య గోవర్ధన్ రెడ్డి గోపాల్ పుల్లయ్య పరశురాం పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



పర్వతాపూర్ గ్రామంలో బి ఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

## ఎరువుల వ్యాపారస్తులతో వ్యవసాయ అధికారుల సమావేశం

**గద్వాల టౌన్, జూలై 4, ప్రభాతవార్త:** గద్వాల, మల్దకల్ మండలాలకు సంబంధించిన గద్వాల వ్యవసాయ సంచాలకుల వారి కార్యాలయం నందు ఎరువుల వ్యాపారస్తులతో వాన కాలం దృష్టిలో పెట్టుకొని సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని గద్వాల మండల వ్యవసాయ అధికారి ఏ ఓ ప్రతాప్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా డి ఏ పి, యూరియా , ఎంఒపి, కాంప్లెక్స్ ఎరువులను కావలసినంత అందుబాటులో ఉంచుకోవాలని అదేవిధంగా రైతులకు డిఏపి తో పాటు నానో డి ఏ పి , నానో యూరియా వాటి యొక్క ఫలితాల గురించి రైతులకు తెలియజేస్తూ ఎం ఆర్ పి రేట్ల పై అధిక ధరలకు విక్రయించి నట్లు అయితే వ్యవసాయ శాఖ చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని , ఈపాస్ మిషన్ ద్వారా విక్రయించవలయునని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. విక్రయించిన తదుపరి రైతులకు రసీదును తప్పకుండా ఇవ్వవలెనని అనే దానిపై సమావేశమును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గద్వాల జిల్లాలో ప్రస్తుతం 1555 .83 మెట్రిక్ టన్నుల యూరియా నిలువలు ఉన్నాయని, ఇవి వర్షాకాలం పంటలకు సరిపోతుందని ఇట్టి నిలువలపై రైతులు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరము లేదని తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సక్రియనాయక్ , వ్యవసాయ సంచా లకులు ఏ డి ఏ సంగీత లక్ష్మి , మల్లకల్ వ్యవసాయ అధికారి రాజశేఖర్ , మల్దకల్, గద్వాల మండలం సంబంధించిన ఎరువుల వ్యాపారస్తులు పాల్గొనడం జరిగిందన్నారు.



ఎరువుల షాప్ యజమానుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి సక్రీ నాయక్

## పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం

**టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి**

**దేవరకద్ర, జూలై 4 ప్రభాతవార్త:** నిరుపేద ప్రజలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలిచిందని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం కౌకుంట్ల మండలం పేరూరు గ్రామంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశానుసారం, ఇందిరమ్మ ఇండ్ల కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పేదవాడి సొంతింటి కలను సహకారం చేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ సహకారంతో, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల్లో భాగంగా బోయ జానకమ్మ కి ప్రొసీడింగ్స్ ఇచ్చి, ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ప్లానింగ్ మరియు భూమి పూజ నిర్వహించిన నాయకులు,కౌకుంట్ల మండల అధికారి శివప్రసాద్. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బంగారు దుకాణంలో చోరీ

**సీసీ ఫుటేజ్‌లో వీడియో వైరల్**

**వడ్డేపల్లి, జూలై 4 ప్రభాతవార్త :** వడ్డేపల్లి మండలం శాంతినగర్ పట్టణంలో శ్రీనివాస జ్యువెలరీ షాప్‌లో చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం యజమాని షాప్ ఓపెన్ చేసి సర్దుకుంటున్నాడు. అప్పటికే మాటు వేసి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి దుకాణంలోకి చొరబడి రూ.50 వేల విలువగల వెండి ఆభరణాలు, రూ.2 లక్షల నగదు ఉన్న బ్యాగును అపహరించాడు. యజమాని తేరుకునే లోపే పరారయ్యాడు. ఈ ఘటన సంబంధించి సిసి ఫుటేజీ వాట్సాప్‌లో వేదికగా వైరల్ అయింది. అయితే జరిగిన సంఘటనపై షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మల్దకల్ నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

**మల్దకల్ జూలై 4 ప్రభాతవార్త:** మల్దకల్ మండల కేంద్రంలో శనివారం రైతు వేదిక నందు దామజములమ్మ దామజములమ్మ బుడ్డప్ప జ్ఞాపకార్థం దామ సువర్ణ మహేష్ మల్టీ స్పెషల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. కావున మల్దకల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించుకోవాలని వారు తెలిపారు అలాగే బిపి షుగర్ ఉన్నవారికి మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేత

**జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఊర్మిళాదేవి**

**దేవరకద్ర, జూలై 4 ప్రభాతవార్త:** ఇంటర్ ప్రథమ, ద్వితీయ, సంవత్సరం చదువుతున్న 340 మంది విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఊర్మిళాదేవి అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఊర్మిళాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందజేసిన పుస్తకాల వల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు కొంతమేర ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. జీవితంలో ఇంటర్మీడియట్ దశ చాలా కీలకమైనదని, ప్రతి ఒక్కరూ ఉజ్వల భవిష్యత్తుకు కష్టపడి చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రైడే డ్రైడేతో వ్యాధులు దూరం

**దేవరకద్ర మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు**

**దేవరకద్ర, జూలై 4 ప్రభాతవార్త:** ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించడం ద్వారా విష జ్వరాలు వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని దేవరకద్ర మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు తెలిపారు. శుక్రవారం దేవరకద్ర మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, కురువగేరి కాలనీలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని కమిషనర్, ఈవో పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత ఫ్రైడే డ్రై డే ద్వారా వ్యాధులు ఎలా అరికట్టవచ్చని ప్రజలకు ఇంటింటికి వెళ్లి కమిషనర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ఇంటింటికి వెళ్లి, ప్రజలకు సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. మురికి నీళ్లు, నిల్వ ఉన్న నీరు, ఇళ్ల పరిసరాలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి, దోమల లార్వాను గుర్తించి నిర్మూలిస్తామన్నారు. స్థానికంగా జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి వారికి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. ఇంటి పరిసరాలలో కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ డబ్బాలు, పాత కుండలు, పనికిరాని వస్తువులను ఉంచుకోరాదని, దానిలో వర్షపు నీరు పడి దోమల లార్వా వృద్ధి చెంది, డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి వ్యాధులు ప్రభలుతాయని దేవరకద్ర మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ సీతానాయక్, మున్సిపల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



డ్రైడే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పచ్చదనం పరిశుభ్రత

**ఉప్పునుంతల, జూలై4 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో శుక్రవారం పచ్చదనంపరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పేరుక పోయిన చెత్తాచెదారం, ముళ్ళ చెట్లను తొలగించారు. పాఠశాల ప్రాంగణంలో అపరిశుభ్రత నెల కొనకుండా జాగ్రత్తలు పాటించాలని మండల పంచాయతీ అధికారి వెంకటేష్ సూచించారు. వర్షాకాలం కావడంతో చెత్తాచెదారం పేరుక పోతే దోమ ఎదుగుదల అధికం గా పెరిగివ్యాధులు ప్రభలే ప్రమాదం ఉంటుందని,ఎప్పటికప్పుడు చెత్తాచెదారం లేకుండా పరిశు భ్రత పాటించాలని రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ కు సూచించారు. అదేవిధంగా ముళ్ల పొదలు పెరుగు తే విషపు పురుగుల బెడద అధికంగా వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయని, దీంతో కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రాంగణం చుట్టుపక్కల అపరిశుభ్రత నెల కొనకుండా చూడాలని ప్రిన్సిపాల్‌కు ఎంపిఒసూచించారు.పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వ ర్లు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ప్రిన్సిపాల్ సైదా, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులలో చదువుపై ఆసక్తి పెంచాలి

**ఇటిక్యాల, జూలై4 ప్రభాతవార్త:** పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులలో విద్యా ప్రామాణి కాలను పెంచాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని గోపల్‌దిన్నె గ్రామంలో గల ఉన్నత పాఠశాలను తనిఖీ చేయగా ఉపాధ్యాయుడు గోపీ నాథ్ విద్యార్థులకు తెలుగు పాఠంశాన్ని బోధిస్తుండగా ఎంఈఓ వెంకటేశ్వర్లు విద్యార్థుల మధ్య టేబుల్‌పై కూర్చుని పర్యవేక్షణ చేశారు. విద్యార్థుల క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూసుకోవాలని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యమైన భోజనం అందించాలని పరిశుభ్రంగా ఉండే కూరగాయలు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.

## ముగిసిన వారాహి గుప్త నవరాత్రులు

**పెబ్బేరు, జూలై 4 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి సన్నిధానంలో శ్రీ వారాహి గుప్త నవరాత్రులు చివరి (తొమ్మిదవ) రోజు సందర్భంగా ఆలయంలో కారెడ్డి నాగిరెడ్డి సౌజన్యంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అమ్మ వారు ఎనిమిది రోజులపాటు అభిషేకాలతో ప్రత్యేక అలంకరణలతో, వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చింది. చివరి రోజు శ్రీలలితా త్రిపుర సుందరి దేవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అలాగే శ్రీ వారాహి దేవి అమ్మవారిని "నోట్ల కట్టలతో" అలంకరించి,శ్వేతా వారాహి అవతా రంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. సాయంత్రం మహిళలచే దీపాలంకరణతో, అమ్మ వారికి పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తరాలు, కుంకుమార్చన, లలిత సహస్రనామ పారా యణం, ప్రత్యేక మంగళహారతులు, భజన సంకీర్తనలతో మొదలగు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ అల్పార కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కర్రే స్వామి,సితార వెంకటేశ్వర్లు, పున్న శ్రీనివాసులు, వీం బొజ్జాచారి, ఎన్ఆర్‌జి మేకలఎల్లయ్య, ప్రదీప్ గౌడ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్, నారాయణ, శాంతన్న, అనిల్ కుమార్ గౌడ్, బాలగౌడ్, ఆర్ఎన్ఆర్ తదితరులు పాల్గొన్నారు.

## మా కాలనీలో మౌలిక వసతులు కల్పించండి

**నారాయణపేట ప్రతినిధి, జూలై 4 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణంలోని మెట్రో ఫంక్షన్ హాల్ వెనుక గల అశోక్ నగర్ (గణేష్‌నగర్) లో కనీస వసతులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ ఏర్పడి దాదాపు 8 ఏళ్లు గడుస్తున్నా అధికారులు ఇంతవరకు కనీస వసతులు అయిన రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. అలాగే బిసి కాలనీ నుంచి వచ్చే నాలా మురికి నీరు,వరద నీరు డ్రైనేజీ వ్యవస్థ లేక పోవడంతో ఇళ్ల మధ్యలో నీరు నిలుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మల్లేష్, పళ్ల వెంకట్ రాములు ఆధ్వర్యంలో కాలనీ వాసులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బోగేశ్వర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కమిషనర్ స్పందిస్తూ వసతుల కల్పన కు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## లేబర్ కోడ్లు రద్దయ్యేదాకా పోరాటాలు

**ఆత్మకూర్ జూలై 4, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం కార్మిక ఉద్యమాలను అణచివేసే కార్యక్రమంలో భాగంగా నూతనంగా ప్రవేశపెట్టినటువంటి నాలుగు లేబర్ కోర్లను రద్దు చేసేదాకా పోరాటాలు ఉదృతం చేయాలని టి యు సి ఐ వనపర్తి జిల్లా అధ్యక్షులు ప్రసాద్ పిలుపునిచ్చారు ఈ మేరకు జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలంటూ శుక్రవారం రోజు ఆత్మకూర్ పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో పియుసి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిం చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్మిక శాఖ అధికారులను తుంగలోతుకేందుకు కొత్తగా ఏర్పాటు చేసిన లేబర్ కోర్లు కార్మికుల పాలిట గుదిబండగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు దేశభక్తితంగా ఔట్సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న అసంఘటితరంగా కార్మికులను తక్షణమే శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టా లని కార్మిక శాఖల ఆదేశానుసారం కనీస వేతనం 26వేల రూపాయలను కార్మికులకు చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరింపజేసి 200 రోజుల పని దినాలను కల్పించాలని ప్రతిరోజు కనీసం600 రూపాయల వేతనాలు చెల్లించే విధంగా చట్టాలు రూపొందించాలని ఆయన కోరారు అందులో భాగంగానే ఈనెల తొమ్మిదిన్న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మి కులు అధిక సంఖ్యలో పాల్గొని పాలకుల మెడలు వంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు అనంతరం దేశవ్యాప్త సర్వత్రిక సమ్మెకు సంబంధించి గోడపత్రికలను ఆయన విడుదల చేశారు ఈ కార్యక్ర మానికి టియుసిఐ ఆత్మకూరు మండలం కార్యదర్శి చెన్నయ్య అధ్యక్షత వహించగా ఏసేబు బాల కృష్ణ తదితరులతో పాటుగా పలువురు కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

## బదిలీలతో పాటు పదోన్నతులను సత్వరమే చేపట్టాలి

◆ ఎస్టీయు టిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రావు

**ఉప్పునుంతల, జూలై4 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బదిలీలతో పాటు పదోన్నతులను సత్వరమే చేపట్టాలని ప్రభుత్వాన్ని ఎస్టియు టిఎస్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం అచ్చంపేట పట్టణంలో ఎస్టియు టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వడ్డే హనుమంతు రెడ్డి, కార్యదర్శి లక్ష్మారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్ రావులతో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల్ ఎక్కువ ఉన్నత పాఠశాలలో వారు మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ నుంచి ప్రధానోపాధ్యాయులకు, ఎస్‌జిటి నుంచి స్కూల్ అసిస్టెంట్‌లకు బదిలీలతో పదోన్నతులు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఎనిమిది నెలల క్రితం సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఉపాధ్యాయులకు వెంటనే రేమ్యునరేషన్ అందజేయాలని వారి డిమాండ్ చేశారు. అనంతరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమా వేశంలో వారు మాట్లాడుతూ పండిట్లను అప్‌గ్రేడ్ చేయాలని, ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న సిఆర్‌టిలకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, పెండింగ్ ఉన్న జీతాలను వెంటనే చెల్లించా లని వారు డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలకు ఉపాధ్యాయ పోస్టును మంజూరు చేయా లని, అప్పుడే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించగలమని వారన్నారు. ఈ కార్యక్ర మంలో వారితో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు పోకల సతీష్, అచ్చంపేట మండలం అధ్యక్ష కార్య దర్శులు ఒగ్గు సుదర్శన్, నారాయణ గౌడ్, సభ్యులు సరస్వతి, ధనలక్ష్మి, విజయలక్ష్మి, రాజు, బ్రహ్మేంద్ర యాదవ్, మాధవి, కవిత, సృజన తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్ఈ

**నారాయణపేట టౌన్, జూలై 4 ప్రభాతవార్త:** నారాయణపేట మండలం అప్పక్ పల్లి లో ఉన్న 132. కె.వి., 33/11 కె.వి. ఉప విద్యుత్ కేంద్రాలను శుక్రవారం స్థానిక ఎస్.ఈ. వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలంలో కురుస్తున్న వర్షాలకు రైతులకు సరఫరా అవుతున్న త్రీ ఫేజ్ విద్యుత్ ఏవిధంగా ఇస్తున్నారని ఉప విద్యుత్ కేంద్రంలో ఉన్న సిబ్బందిని అడిగి తెలు సుకున్నారు. వ్యవసాయరంగానికి ఏలాంటిఅంతరాయం లేకుండా నిర్ణిత సమయానుసారం విద్యు త్ సరఫరా చేయాలని ఎస్ఈ వెంకటరమణసూచించారు. వ్యవసాయరంగానికి నూతనంగా అమ ర్చిన విద్యుత్‌నియంత్రిక పనులను ఎస్ఈవెంకటరమణ సందర్శించారు. అలాగే ఇటీవల 33.కె.వి. ట్రికటింగ్ చేసిన పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన వెంబడి ఏడిఈ శ్రీనివాస్, రూరల్ ఏఈ సాయినాథ్ రెడ్డి, ఎల్ఐ. జి.రవీంద్రాచారీ, దేవన్న, ఏఎల్ఎమ్ శ్రీకాంత్‌లు ఉన్నారు.

## దొడ్డి కొమరయ్యకు ఘన నివాళి

**నారాయణపేట ప్రతినిధి, జూలై 4 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో సిఐటియు కార్యాలయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సీపీఎం పార్టీ అధ్వర్యంలో శుక్రవారంఘనంగా నిర్వహించడం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వెంక ట్రామిరెడ్డి మాట్లా డారు. దొడ్డి కొమరయ్య సాధారణ గొర్రెల కాపరుల కుటుంబంలో జన్మించి తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు అయినటువంటి గొప్ప వీరుడని కొనియాడారు. ఆ రోజుల్లో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దొరలు, జాగిర్దారుల ఆకృత్యాలకు అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారు అని అన్నారు. కొమరయ్య పోరాటం భూమికోసం, భుక్తి కోసం,సామాజిక సమానత్వం,వెట్టి చాకిరీ నిర్మూలనకోసం కులవర్ణ వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు .యువత అంతా మత్తుకు బానిసై జీవితాలను కుటుంబాలను నాశనం చేసుకుంటు న్నారని అన్నారు. యువత అంతా చెడు మార్గంలో పోకుండా దొడ్డి కొమురయ్య ఆశయ సాధన కోసం పోరాటం చేయాలనిఅన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బాల్‌రామ్, అంజిలయ్య గౌడ్, సీపీఎం జిల్లా నాయకులు కె.కాశప్ప,ఎం యాదప్ప, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారికి తిరిగి అందజేసిన పోలీసులు

**ఖిల్లాగణపురం. జూలై4. ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన గాండ్ల రాజు వెంకటేష్ అనేవారు మూడు నెలల క్రితం మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నారు అప్పుడే సిఈఐఆర్ పోర్టల్ ద్వారా అప్లికేషన్ చేసుకున్నారు ఆ మొబైల్‌లను గణపురం పోలీసులు గుర్తించి ఈరోజు అందజేసినట్లు ఇంచార్జ్ ఎస్సై జయన్న తెలిపాడు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరు తమ మొబైల్ ఫోన్లు పోయిన వెంబడే సిఇఐఆర్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే మేము వాటిని వెతికి పెడతామన్నారు ఈ మొబైల్ ను ట్రేస్ చేసిన క్రైమ్ కానిస్టేబుల్ పి లింగం ను ఎస్ఐ ప్రత్యేకంగా అభినందించారు

# ఒకే ఉపాధ్యాయుడుతో పాఠశాల నిర్వహణ

**- శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం**



పాఠశాలలో బోధన చేస్తున్న ఏకోపాధ్యాయుడు

**వంగూరు, జూలై4 ప్రభాతవవార్త:** ప్రభుత్వ పాఠశాలలను బలో పేతం చేసి గ్రామాల్లో ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తుంటే... కొన్ని గ్రామాలలోని పాఠశాల భవ నాలు శిథిలావస్థకు చేరు కున్న పాఠశాలలో విద్యా ర్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయుల లేకపో వడం వల్ల నానా ఇబ్బందులకు గురవుతు న్నారు. ఇందుకు ఉదాహ రణగా... వంగూరు మండలం నిజాంబాద్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలవస్థకు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ పాఠశాలలో 5 తరగ తులకు సంబంధించి 30 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఒక్కడే ఉపాధ్యాయుడు ఉండడంతో విద్యార్థులకు విద్యాబోధన అందిం చడంలో పూర్తిగా అన్యాయం జరుగుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేదింటి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అంది స్తామని ప్రభుత్వ హామీలకు గ్రామాలలో ఉన్న ప్రజలు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంపించే బదులు ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని సదుద్దే శంతో సర్కారుబడులలో విద్యార్థులను చేర్పిస్తున్నా మని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. మా విద్యా ర్థుల భవిష్యత్తునుదృష్టిలో పెట్టుకొని ప్రభుత్వబడులను పట్టించు కొని విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలను కల్పించేం దుకు స్థానిక ఎమ్మెల్యే స్పందించి నూతన పాఠశాల భవనం మరియు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



శిథిలావస్థలో పాఠశాల భవనం

# సంక్షేమ హాస్టళ్లను పరిశీలించిన వైద్య బృందం

**బిజినేపల్లి, జూలై 4 ప్రభాతవార్త:** పాలెం గ్రామంలోని ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టల్స్‌ను జిల్లా వైద్యశాఖ బృందం శుక్రవారం సంద ర్శించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె.వి స్వరాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎం. వెంకట దాసు వసతి గృహా లను సందర్శించి అక్కడ ఉన్న పరిసరాలను వంటగదిని వంట సామాగ్రిని నీటి నిల్వలను పరిశీలించారు. వసతిగృహాల నందు విద్యార్థులు సమూహంగా ఉన్నందున గజ్జి (తామర) చర్మ వ్యాధు లు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అదేవిధంగా పరి శుభ్రమైన నీటిని వాడనిచో వాంతులు, నీళ్ల విరోచనాలు జాండీస్ టైఫాయిడ్ వచ్చే అవకాశాలు ఉన్నట్టు తెలియజేశారు. అదే విధం గా వర్షాకాలంలో ఈ నాలుగు నెలలు దోమలు, ఈగలు అధికంగా ఉత్పత్తి జరుగుతుందని వాటి దోమల వల్ల వచ్చే చికెన్ గున్యా, డెంగ్యూ మలేరియా, ఫైలేరియా, మెదడు వాపుతో పాటు ఇత రత్ర వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున పరిసరాలు పరి శుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత హ్యాండ్ వాష్ (భోజనానికి ముందు మలవిసర్జన తర్వాత ప్రతి ఒక్కరూ సబ్బుతో చేతులు కడుక్కోవాలి అని సూచించారు. వైద్యాధికారి డా. ప్రియా ంక మాట్లాడుతూ హాస్టల్లో ఉండే విద్యార్థిని విద్యార్థులకు వార్డెన్స్ శ్రద్ధతో తమ పిల్లలుగా భావించి వారి ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏదేని వైద్య సహాయం అవసరం ఉంటే స్థానికంగా ఉండే వైద్య సిబ్బందితో సంప్రదించాలని సూచించారు. ఇంకా ఏమైనా ఆరోగ్య సమస్యలు అధికంగా ఉంటే 24 గంటలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు సేవలు వినియో గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ బాదం రాజేశ్వర్, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఏఎన్ఎం గజవర్ధనమ్మ, మల్లిక, ఆశా వర్కర్లు పార్వతి, షమీం, విజయ లీల, వరలక్ష్మి, జయమ్మ హాస్టల్ వార్డెన్సు (హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ యాదయ్య ,జయశంకర్, సుధాకర్ హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షేమ హాస్టళ్లను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

# విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి

◆ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు

**వనపర్తి, జూలై 4 ప్రభాతవార్త:** ప్రభుత్వ గురుకులాల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటే శ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన జిల్లాలోని వివిధ ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలను సందర్శించారు. మొదట వనపర్తి పట్టణంలోని కెడిఆర్ నగర్‌లో ఉన్న తెలంగాణ మైనారిటీ రెసిడెన్షి యల్ బాలికల జూనియర్ కళాశాలను సందర్శించారు. అనం తరం, జగత్‌పల్లి గ్రామంలో ఉన్న తెలంగాణ మైనారిటీ రెసిడెన్షి యల్ స్కూల్ బాలుర నాగవరంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర స్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి అందు బాటులో ఉన్న వసతులు, భోజన ఏర్పాట్లు, వంటగది, తాగునీటి సదుపాయం,బాత్‌రూములు, టాయిలెట్లను పరిశీలించారు. విద్యా ర్థుల నిద్ర కోసం పడకలు (కాట్స్) సరిపడ ఉన్నాయా లేదా అన్నది ప్రత్యేకంగా పరిశీలించారు. అలాగే ప్రతి పాఠశాలలో మంజూరు చేసిన మొత్తం సిబ్బంది ఎంత, అదేవిధంగా ఇపటి వరకు ఎంతమంది విద్యార్థులు చేరారు అనే విషయాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే వాటిని తన దృష్టికి తీసుకురావాలని అదనపు కలెక్టర్ సూచించారు. విద్యార్థుల అభ్యున్నతికై అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గురుకుల పాఠశాలలోని వంటగదిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

# విజయవంతంగా ముగిసిన జోనల్ డ్యూటీ మీట్

◆ ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంస పత్రాలు

◆ డ్యూటీ మీట్ ఉద్దేశం పోలీసు అధికారుల నైపుణ్యాలను మెరుగుపరచడం: డిఐజి ఎల్ఎస్ చౌహన్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై4 ప్రభాతవార్త:** జోగులాంబ జోన ల్ పోలీస్ డ్యూటీ మీట్ 2025 జిల్లా ఎస్పీ ఆఫీసు నందు ముగింపు కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జోనల్ డ్యూటీ మీట్ 2025 ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఐజి ఎల్ ఎస్ చౌహన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎస్పీలు వారి సిబ్బందితో పాటుపాల్గొన్నారు.ఈ మీట్‌లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాలకు చెందిన పోలీసు అధి కారులు మరియు సిబ్బంది తమ తమ ప్రత్యేక పోలీసు విధుల నైపుణ్యాలను ప్రదర్శించారు.ఈ మీట్‌లో వివిధ కేటగిరీలలో ఉన్న పోటీలు నిర్వహించబడ్డాయి.అందులో ముఖ్యంగా 1.సైంట ఫిక్ అయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్ ఈవెంట్‌లో ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, క్రిమినల్‌లా, వ్రాత పరీక్ష, ఓరల్ టెస్ట్, లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎక్స్ బిట్స్ ప్రాక్టికల్ టెస్ట్, ఫింగర్ ప్రింట్ సైన్స్ ప్రాక్టికల్ అండ్ ఓరల్ టెస్ట్, క్రైమ్ సీన్ ఫోటోగ్రఫీ ప్రాక్టికల్, పోలీస్ పోర్ట్రైట్ ప్రాక్టికల్ అండ్ రిటన్ టెస్ట్, అబ్జర్వే షన్ టెస్ట్ ప్రాక్టికల్ అండ్ రిటన్ టెస్ట్ 2.యాంటి సబాటేజ్ చెక్ ఈవెంట్ లో వెహికల్ సెర్చ్, గ్రౌండ్ సర్చ్, రూమ్ సెర్చ్, యాక్సి స్ కంట్రోల్, 3. కంప్యూటర్ అవేర్నెస్ కాంపి టీషన్ ఈవెంట్‌లో కంప్యూటర్ అవేర్నెస్ ఆఫీస్ ఆటోమేషన్, ప్రోగ్రామింగ్ ఎబిలిటీ, 4. డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్ ఈవెంట్‌లో ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్, నార్కోటిక్స్,సెర్చ్ మరియుపోలీస్ ఫోటోగ్రఫీ కాంపిటీషన్,పోలీస్ వీడియోగ్రఫీ కాంపిటీషన్ ఈవెంట్స్ నిర్వహించారు.ఈ సంద్భం గా డీఐజీ గారు మాట్లా డుతూ, ఈ డ్యూటీ మీట్ ఉద్దేశం పోలీసు అధికారుల మరియు సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపర చడం, వాటి వినియోగాన్ని ప్రోత్సహించడం క్రైమ్ ఇన్వెస్టిగేషన్ మరియుసైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్ ఉపయోగపడుతుందని, అలాగే ఒక క్రిమినల్‌ను చట్టం నుండి తప్పించుకోకుండా ఉపయోగపడు తుందన్నారుఈ మీట్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ప్రతిభా వంతులకు ప్రతి ఒక్కరిని ప్రోత్సహిస్తూ వారికి స్ఫూర్తిని నింపి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో గెలుపొందిన వారిని స్టేట్ మీట్‌లో ప్రతిభ కనబరిచిన వారు నేషనల్ మీట్‌కి పంపడం జరుగుతుందన్నారు.ఇక్కడ ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి మెడల్స్, ట్రోఫీలు మరియు ప్రశంసాపత్రాలు అందజేశారు. డ్యూటీ మీట్లో నాగర్‌కర్నూల్ జిల్లా అత్యంత ఉత్తమ ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్షిప్ దక్కించు కున్నది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘు నాథ్, మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి ఐపీఎస్, నారాయణపేట జిల్లా ఎస్పీయోగేష్ గౌతమ్ ఐపీఎస్, వనపర్తి జిల్లా ఎస్పీ గిరిధర్ ఐపీఎస్, అదనపు ఎస్పీ సిహెచ్ రామేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, అదనపు ఎస్పీ నాగర్‌కర్నూల్ రామేశ్వర్, ఏఆర్ అదనపు ఎస్పీ నారాయణపేట రియాజ్ ఉల్ హక్, నాగర్‌కర్నూల్ డిఎస్పి శ్రీనివాస్, నాగర్‌కర్నూల్ డిసిఆర్‌బిడి ఎస్.పి.సత్యనారాయణ, అచ్చంపేట డిఎస్పి శ్రీనివాస్, నాగర్‌కర్నూల్ ఎస్‌బి. సిఐ. కనకయ్య, నాగర్‌కర్నూల్ డిసిఆర్‌బి సిఐ ఉపేందర్, మరియు వివిధ జిల్లాలకు చెందిన 200 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఉమ్మడి జిల్లా అధికారులు

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస ఔషదాలు వసతులు కరువు

◆ బీజేపీ పట్టణ అధ్యక్షులు భగత్‌రెడ్డి

**అయిజ జూలై 4, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస అవసరాలు వసతులు గాని కరువయ్యాయని ఇదే రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని బీజేపీ పట్టణ అధ్యక్షులు భగత్ రెడ్డి పేర్కొన్నారు శుక్రవారం స్థానిక బిజెపి నాయకులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 2019-2021 మధ్య కాలంలో నిర్వ హించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం, పురుషులలో 13.8 మరియు మహిళలలో 10.2 మధుమేహ వ్యాధిగ్రస్తులుగా గుర్తించబడ్డారని దేశంలోనే మన రాష్ట్రం మూడో స్థానంలోకేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తాజాగా పార్లమెంట్‌కు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నదనిఅయితేప్రభుత్వ వైద్యశాలలో గత 4 నెలల నుంచి మధుమేహంకు సంబంధించిన ఇన్సులిన్ లేక పోవడం చాలా బాధాకరం అన్నారు ఔషధాలు తయారు చేసే కంపెనీలతో ప్రభుత్వానికి మధ్య ఒప్పందాలు సరిగా లేనందున ఇన్సులిన్ అందుబాటులో ఉండడం లేదు. దానివలన సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2022 ప్రకారంగా ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా అందాల్సిన మెడిసిన్ 863 రకాలు. కానీ అందు బాటులో ఉన్నావి మాత్రం 266 రకాల మెడిసిన్స్ మాత్రమే ఉన్నాయన్నారు అలాగే కాంట్రాక్ట్ వైద్యులకు గత మూడు నెలల నుంచి జీతాలు కూడా ఇవ్వటం లేదని వైద్యులు తమ తో విన్నవించినట్టు తెలిపారు.ప్రస్తుతం వాతావరణం మార్పు జరుగు తున్నది. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉన్నది.డెంగీ,మలేరియా, దయేరియావంటి వ్యాధుల తో ప్రభు త్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు రోగులు వరుస కడుతు న్నారని వైరల్ జ్వరాల బారిన పడుతూ జనం అవస్థలకు గురవు తున్నారు కనుక ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి సరైన వైద్య సదు పాయాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, బెల్లంకొండ నాగరాజు, పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షులు వీరేష్ గౌడ్,బూత్ అధ్యక్షులు నరసింహులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న బిజెపి నాయకులు

## రాయితీపై ఆయిల్ తోటలు

-మండల వ్యవసాయాధికారి మురళిధర్

**భూత్పూర్, జూలై 4,ప్రభాతవార్త:** రాయితీపై ఆయిల్ తోటల పెంపకానికి మండలంలోని ఆసక్తికల్గిన రైతుల నుంచి అభ్యర్థనల్ని స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి మురళిధర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ప్రతి ఎకరంలో 57ఆయిల్ మొక్కల పెంపకానికి ప్రభుత్వం అనుమతినిస్తుందని,నాలుగేళ్ల వరకు ఎకరాకు నిర్వహణ ఖర్చు రు.4,200లు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు.ఇదేవిధంగా డ్రిప్ ఇరిగేషన్ కింద ఎకరాకు రు.20వేల 317లు ప్రభుత్వం రాయితీ కల్పిసుందని మండలంలోని రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయి ల్ తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులు ఎకరాకు రు.1140లు డీహెచ్ అండ్ ఎస్ఓ,మహబూబ్‌నగర్ పేరిట డిడి తీసి దీనికి పట్టాదారు పాసుపుస్తకం,ఆధార్‌కార్డును జతచేసి ఆయా గ్రామ వ్యవసాయ విస్తరణాధికారికి సమర్పించాలని మండల వ్యవసాయా ధికారి మురళిధర్ కోరారు.

## రేషన్ బియ్యం పట్టివేత: కేసు నమోదు

**వంగూరు, జూలై 4 ప్రభాతవార్త:** వంగూరు మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో రేషన్ బియ్యం నిల్వ ఉంచారనే పక్కా సమాచారం రావడంతో వంగూరు మండల ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. వివరలలోకి వెళితే రంగాపూర్ గ్రామాని చెందిన వాస సాయిబాబు, తిరుప తయ్య షాపులలో అక్రమంగా నిల్వ ఉంచిన 13 బస్తాల దొడ్డు బియ్యం, 26 బస్తాలా సన్న పి.డి.ఎస్ బియ్యాన్ని స్వాధీన పరుచుకొని సివిల్ సప్లై డిపార్ట్మెంట్ వారికి సమాచారం అందిం చడంతో ఆ శాఖ అధికారులు అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు వంగూరు ఎస్ఐ.మహేష్ తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో కాడెద్దులు, నాటు కోళ్లు మృతి

**ఊట్కూర్, జూలై 4 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండలం పెద్దపోర్ల గ్రామంలో పాపలి లచ్చప్ప రైతుకు చెందిన కాడెద్దులు, వంద నాటు కోళ్లు షార్ట్ సర్క్యూట్‌తో మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనలో ద్విచక్రవాహనం, గడ్డి కుప్ప, నిల్వ చేసిన ఎరువులు, రసాయనాలు, ఇతర సామగ్రి మంటల్లో కాలిపోయాయి. పొలం వద్ద ఉన్న గుడిసెలో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు అంటు కోగాప్రమాదం జరిగిందని రైతుకన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

**వెల్దండ, జూలై 4 ప్రభాతవవార్త:** మండల కేంద్రంలోని హైదరా బాద్-శ్రీశైలం జాతీయ రహదారిగా గత 3 రోజుల క్రిందట పోలీసు తనిఖీలలో భాగంగా మద్యం సేవించి వాహనాన్ని నడుపు తున్న కల్వకుర్తికి చెందిన ధార రామకృష్ణ (34) కోర్టులో హాజరు పర్చగా శుక్రవారం కల్వకుర్తి జడ్జి కావ్య మద్యం సేవించిన వ్యక్తికి 3రోజులు జైలు శిక్షతో పాటు రూ.600లు జరిమానా విధించారని ఎస్సై కురుమూర్తి తెలిపారు.

## భూత్పూర్ పీఎస్ పరిధిలో తల్లీకూతళ్ల అదృశ్యం

**భూత్పూర్, జూలై 4,ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం కొత్త కప్పెటకు చెందినతల్లీ కూతుళ్లు పోలెమోని వెంకటే శ్వరమ్మ (35),ఆమెకూతురు సాహితి(5)గత పక్షం రోజులుగా కన్పించడం లేదని శుక్రవారం భూత్పూర్ పీఎస్‌లో ఫిర్యాదు నమోదైంది. కప్పెటకు చెందిన వెంకటేశ్వరమ్మకు మొదటి భర్త చనిపోగా, కొత్తూర్‌కు చెందిన పోలెమోని తిరుపతయ్యకు ఎనిమి దేళ్ల క్రితం వెంకటేశ్వరమ్మను ఇచ్చి రెండోవివాహం చేశారు.వీరికి ఐదేళ్ల బాలిక సాహితి సంతానం.అయితేకొన్నిరోజులుకాపురం సజావుగా సాగిన, గత కొన్నేళ్లుగా భార్యాభర్తలిరువురు కలహాలకు పాల్పడే వారని, గత నెల20న గొడవ తీవ్రమై వెంకటేశ్వరమ్మ తన ఐదేళ్ల కూతురు సాహితితో కలిసి ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిందని కొత్తకప్పెటకు చెందిన ఆమె అన్నయ్య పేరూర్ సోమ్ గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపు తున్నట్లు భూత్పూర్ పీఎస్ ఎస్‌హెచ్ఓ చంద్రశేఖర్ తెలిపారు.

## బిఎల్ఓలకు వెంటనే రెన్యూమరేషన్ అందజేయాలని వినతి

**ఉప్పునుంతల, జూలై 4 ప్రభాతవార్త :** అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న బూతు లెవల్ అధికారులకు వెంటనే రెన్యూ మరేషన్ అందజేయాలంటూ శుక్రవారం అచ్చంపేట ఆర్డిఓ కార్యాలయం ఏవో సలీమొద్దీన్‌కు అంగన్‌వాడి కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు. ప్రతి ఎన్నికల సమయం లో ఓటర్ నమోదు కార్యక్రమం, ఎన్నికల సంబంధించిన ప్రతి పని బూతు లెవల్ పనిచేస్తున్నప్పటికీ తమకు ప్రభుత్వం గుర్తించి సత్వరమే పారితో షికం అందజేయాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బూతు లెవల్ అధికారులు ఆర్డీవో కార్యాలయం ఏఓ సలీమొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు.

## ఫోటోగ్రఫీలో ప్రశంసా పత్రం అందుకున్న ఎస్సై

**నవాబుపేట, జూలై 4 ప్రభాతవార్త:** పోలీసులు తమ మంచి పనితనం లేదా ప్రత్యేక ప్రతిభను కనబరిచినప్పుడు ప్రశంసా పత్రా లు అందుకున్నారు. అందులో భాగంగా నవాబుపేట పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై విక్రంకు ఫోటోగ్రఫీ విభాగం లో జోనల్ లెవల్ తృతీయ స్థానం పొందిన ఎస్సై విక్రమ్‌కు శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగిన జోనల్ లేవల్ పోలీస్ డ్యూటీ మీట్ 2లో డిజి ఎల్ ఎస్ చౌహన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఫోటోగ్రఫీలో కూడా, ఒక ఎస్సై ఒక నిర్దిష్ట సంఘటన లేదా కార్యక్రమాన్ని చక్కగా చిత్రీక రించి, అది అందరికీ ఆదర్శంగా నిలిస్తే, అటువంటి ప్రతిభను గుర్తించి ప్రశంసా పత్రం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

## మురళిధర్‌రాజుకు ఘన నివాళి

**భూత్పూర్, జూలై4,ప్రభాతవార్త:** భూత్పూర్ మండలంలో ఎక్కువ కాలం ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్‌మెంట్ తీసుకుని వయసు రీత్యా అనారోగ్యం పాలై శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందిన ప్రస్తుత భూత్పూర్ బీసీకాలనీ నివాసి,భట్టుపల్లి గ్రామానికి చెందిన మురళిధర్‌రాజుకుపలువురు ఘనంగా నివాళులర్పించారు .మురళిధర్‌రాజు మరణవార్తను విన్న భూత్పూర్ మున్సిపాలిటీ మాజీచైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు బీఆర్ఎస్‌నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,మొహ్మద్ సాధిక్, గొడుగు వెంకటయ్య, పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు సత్తూర్ బాల్‌రాజ్‌గౌడ్, జిల్లా కవన వేదిక అధ్యక్షుడు,ప్రముఖ కవి, ఉపాధ్యాయుడు రవి చంచల,ప్రభాకర్‌తో పాలుపలువురు ఉపాధ్యాయులు మురళిధర్ రాజ్‌కు శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.

## భూమి ఉన్న ప్రతి రైతు ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**అమరచింత జూలై 4.ప్రభాతవార్త:** భూమి ఉన్న ప్రతి రైతు ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పకుండా చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు దామోదర్ రైతులను కోరారు. శుక్రవారం అమరచింత మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు దామోదర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడానికి ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ కేంద్ర ప్రభుత్వం అమలు చేసిందని ఆయన తెలిపారు. అలాగే రైతులకు పిఎం కిసాన్ పెట్టుబడి సహాయం రాని రైతులు ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల పీఎం కిసాన్ డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఆయా గ్రామాల తోపాటు అమరచింత పట్టణ రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో మండల ఏఈఓ శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి



**వనపర్తి ప్రతినిధి, జులై4 ప్రభాతవార్త:** స్వర్గీయ కొణిజేటి రోశయ్య నేటి సమాజానికి ఆదర్శ ప్రాయుడని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం జిల్లా టూరిజం, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి ప్రాంగణంలో నిర్వహించిన స్వర్గీయ కొణిజేటి రోశయ్య 93వ జయం తి కార్యక్రమంలో రోశయ్య చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి తనవంతు సహకారం అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి పి. సీతారాం, పిడిడి ఆర్డీఓ ఉమాదేవి, ఇతర జిల్లా అధికారులు, యూనియన్ బ్యాంక్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది నివాళులు అర్పించినవారిలో ఉన్నారు.



**మహబూబ్‌నగర్, జులై 4 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి రోశయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన చేసిన ప్రజాసేవను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రోశయ్య పరిపాలనలో నిష్ఠ, నియమం, సేవా తత్వంతో ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. ఆయన నిష్కలంక రాజకీయ జీవితాన్ని ప్రతి అధికారినీ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత, రాజకీయం పట్ల నైతిక విలువలు ఎంతో మందికి మార్గదర్శకంగా నిలిచాయన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఏవో రుక్మిణి భాయి, ఆర్‌ఐలు కృష్ణయ్య, రవి, నగేష్ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**నారాయణపేట, జులై4 ప్రభాతవార్త:** జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు యంత్రాంగం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్‌లు రోశయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ రోశయ్య సుదీర్ఘ కాలంగా ప్రజాసేవలో నిమగ్నమై, చేసిన దేశసేవ, పరిపాలన పటిమ, నిష్కళంక రాజకీయ జీవితాన్ని స్మరిస్తూరాజకీయాల్లో ఉన్నతమైన నైతిక విలువలకు నిలయంగా నిలిచారని, ఆయన సేవాతత్వం, ప్రజల పట్ల కలిగిన కట్టుబాటు ప్రతి అధికారికి ప్రేరణగా నిలవాలని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ నరసింహ,ఎస్సై నరేష్, సునీత, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలను సందర్శించిన కలెక్టర్


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 4 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి జిల్లాలో ఉన్న పలు సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలను, కళాశాలలను సందర్శించి రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనార్టీ సంక్షేమ, బాలుర ,బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను ఆమె ప్రత్యక్షంగా సందర్శించి ఆయా పాఠశాలలు,కళాశాలలో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అంతే కాకుండా కావలసిన మౌలిక సదుపాయాల వివరాలను సేకరించారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ముందుగా జిల్లా కేంద్రంలో రాజేంద్ర నగర్‌లోని తెలంగాణ మైనార్టీ బాలికలజూనియర్ కళాశాల1, సరోజినీ రాములమ్మ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కాంపౌండ్,శేషాద్రి నగర్‌లో ఉన్న తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాల 1,తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల 3, న్యూటౌన్ లోని తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాల2, హీరా మోడల్ స్కూల్ క్రిస్టియన్ పల్లి భవనంలో ఉన్న తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల జూనియర్ కళాశాల 3,దేవరకద్ర మండలం చౌదర్ పల్లి లోని ఎస్‌విఐటిఎస్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో ఉన్న తెలంగాణ మైనార్టీ బాలుర జూనియర్ కళాశాల 2,తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల జూనియర్ కళాశాల(అడ్డకల్)1, దేవరకద్రలోని ఎస్‌బిఐ బ్యాంక్ పక్కన ఉన్న తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల 2,దేవరకద్ర మండలం చౌదర్ పల్లి గ్రామంలో ఎస్‌విఐటిఎస్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాలలు,దేవరకద్ర మండలం అమ్మాపూర్ రోడ్డులో మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాల,(సి.సి కుంట)ను, మహబూబ్‌నగర్ మండలంలోని ధర్మా పూర్‌లో ఆల్ మదీనా కాలేజి ఆఫ్ ఎడ్యుకేషన్ భవనంలో ఉ న్న తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ బాలికల జూనియర్ కళాశాలను, మహబూబ్‌నగర్ రూరల్ మండలం లోని రామిరెడ్డి గూడెం గ్రామంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను, జిల్లా కలెక్టర్ సందర్శించి మౌలిక సదుపాయాలు పరిశీలించి తెలుసుకున్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జెపిఎన్‌ఈఎస్ భవనం, క్రిస్టియన్‌పల్లిలో తెలంగాణ మైనార్టీబాలికల గురుకుల పాఠశాల1,తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల 2, తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాల 3ను సందర్శించి మౌలిక వసతులు తెలుసుకున్నారు.కాగా ఆయా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల మంజూరు సంఖ్య, ఎంతమంది చదువుతున్నారు. గత 5 సంవత్సరాలలో అత్యధికంగా ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలు,అవసరమైన అదనపు బ్లాకులు, విద్యార్థులకు టాయిలెట్లు, బాత్రూంలు, డ్యూయల్ డెస్కులు, తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, మంచాలు,తదితర అవసరాలను అడిగి వివరాలు సేకరించారు.ఈ వివరాలన్నీ కూడా ప్రభుత్వం నిర్దేశించిన ప్రోఫార్మాలో మౌలిక వసతుల సదుపాయాలు జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించి ప్రభుత్వానికి పంపనున్నారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శంకరా చారి, ఆయా పాఠశాలలు/ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో పాటు, డిసిఒలు ఉన్నారు.

## రైతులు రుణాలు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలి

### డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు

**ఉప్పునుంతల, జూలై 4 ప్రభాతవార్త :** స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సింగల్ విండో) లో పంట రుణాలు తీసుకున్న రైతులు వడ్డీతో సహా సమయానికి రుణాలు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు తెలిపారు. పంట రుణాలు తిరిగి చెల్లించి రెన్యువల్ చేసిన రైతులకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 3 శాతం వడ్డీ రాయితీ లభిస్తుందని వివరించారు. మీరు చెల్లించాల్సిన వడ్డీ కేవలం 4 శాతం మాత్రమే అంటే 100 రూపాయలకు కేవలం 25 పైసలు వడ్డీ మాత్రమేనని వివరించారు. రెన్యువల్ చేసుకోకపోతే వడ్డీ రాయితీ వర్తించదని అదనపు వడ్డీ, అపరాధ వడ్డీ కలిపి 13.75 శాతం వడ్డీ భరించాల్సి వస్తుందని, మీ పేరు సిబిల్‌లో నమోదు అవుతుందని భవిష్యత్తులో తిరిగి రుణాలు పొందడం కష్టం ఉంటుందని డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు వివరించారు.సింగిల్ విండో చైర్మన్ తో పాటు సంఘ సిఈఓ కొత్త రవీందర్ రావు ఉన్నారు.

## వైద్య విద్యార్థికి ఆర్థిక చేయూత

**వెల్దండ, జులై 4 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని రాచూరు గ్రామానికి చెందిన జడ్పీహెచ్ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థి వైద్య విద్యార్థి కొమ్ము సింధూరకు, క్లాస్ మెంట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వానరాఘవేందర్ వారి ప్రోత్సాహంతో డాక్టర్ శశికాంత్ మహబూబ్‌నగర్ రూ.25వేలు, డాక్టర్ శరత్ చంద్ర కల్వకుర్తి రూ.10వేలు, వాన రాఘవేందర్ టీచర్ రూ.10వేలు, రవీందర్ టీచర్ రూ.2500, కొట్ర గ్రామానికి చెందిన సంధ్యా ప్రవీణ్ రూ.2500 మొత్తం రూ.50 వేల సేకరించి వైద్య విద్యార్థి తండ్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి క్లాస్మెంట్ అధ్యక్షులు రాజేందర్, టీచర్ ప్రధాన కార్యదర్శి సాయిబాబు, కోశాధికారి కిషన్, జిల్లా కార్యదర్శి శోభన్‌బాబు, వెల్దండ క్లబ్ అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి, హెచ్ఎం జంగయ్యతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

## కలెక్టర్‌కు వినతి

**మక్తల్ టౌన్, జూలై4 ప్రభాతవార్త:** అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ ఆధ్వర్యంలో అధ్యక్షులు పృథ్వీరాజ్ నారాయపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు పృథ్వీరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దళిత విద్యార్థులకు నాణ్యమైన కార్పొరేట్ విద్యను అందించే బెస్ట్ అవైలబుల్ ఉచిత విద్యా పథకం కింద చదువుతున్న విద్యార్థుల గత 3 సంవత్సరాల మొండి బకాయి రూ. 200 కోట్ల వరకు ఉన్నాయని ఈ క్రమంలోనే మన నారాయణపేట జిల్లా పరిధిలో రూ.2 కోట్ల బెస్ట్ అవెలబుల్ స్కూళ్ల మొండి బకాయిలున్న కారణంగా ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు దాటుతున్న పిల్లలను చాలా పాఠశాలలో చేర్చుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా నాయకులు తల్వార్ నరేష్ మాట్లాడుతూ వెంటనే మన జిల్లా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ యొక్క రూ.2 కోట్ల పెండింగ్ ఫిజు బకాయిలను చెల్లించి ప్రైవేట్ పాఠశాల యాజమానుల వేధింపుల నుండి తల్లిదండ్రులను, పిల్లలను కాపాడాలని, వారి చదువులు సాఫీగా కొనసాగేలా చూడాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ అధ్యక్షులు పృథ్వీరాజ్, తల్వార్ నరేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడిగా మారిన జిల్లా కలెక్టర్

- ◆ ప్రయోగాత్మక విధానంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు
- ◆ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి
- ◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


విద్యార్థులకు గణితం బోధిస్తున్న కలెక్టర్


విద్యార్థులతో మాట్లాడుతున్న వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, జూలై 4 ప్రభాతవార్త :** ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్ నాగవరంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల(పెద్దమందడి)లో కలెక్టర్ ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు గణిత పాఠ్యాంశాలను బోధించారు. గణితంలో మెలకు వలను తెలుసుకొని పాఠ్యాంశాలను నేర్చుకోవడం ద్వారా సులు వుగా గణిత సమస్యలను సాధించ వచ్చని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గణితశాస్త్రానికి సంబంధించి పలు ప్రశ్నల ను అడిగి విద్యార్థుల ద్వారా సమాధానాలు రాబట్టారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు నోటు పుస్తకాలను బహుమతి గా అందజేశారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తాము చదివిన పాఠశాల, కళాశాలతో పాటు తమ భవిష్యత్తు కోసం సహకరిస్తున్న ప్రభుత్వానికి కూడా మంచి పేరు తేవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నాగవరంలో ఉన్నసాంఘిక సంక్షేమబాలికల గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాలలను, మర్రి కుంట లో ఉన్న గిరిజ న సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను, అదేవిధంగా సాయి నగర్ కాలనీలో ఉన్న బాలుర మైనారిటీ సంక్షేమ గురుకుల జూని యర్ కళాశాల, వల్లభ్ నగర్‌లోని మైనారిటీ సంక్షేమ బాలికల గురు కుల పాఠశాలలను సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా గురుకులాల్లోని వసతి గృహాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలను ఆరా తీశారు. విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని,ఆ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని ప్రిన్సిపాల్‌కి సూచించారు. గురుకులాల్లోని డార్మెటరీలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల వసతి, వారు పడుకోవడానికి కావలసిన పడకలు, మరుగుదొడ్ల సౌకర్యాలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది విద్యా ర్థులు ఉన్నారు ఇంకా ఎన్ని పడకలు అవసరమని వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారు ఫలితాలు ఎలా వస్తున్నాయి అనే విషయాలు అడిగరూ. ప్రయోగాత్మక విధానంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు అని కలెక్టర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠ్యాంశాలను అర్థం చేసుకోవడం ద్వారా సులువుగా నేర్చుకోవడమే కాకుండా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. విద్యార్థులు ఎప్పుడు కూడా తాము ఏ విషయంలోనూ వెనకబడి ఉన్నామని అనుకోవద్దని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎప్పటికప్పుడు విద్యార్థులందరూ జనరల్ నాలెడ్జ్ పెంపొందించుకోవడమే కాకుండా,అన్ని అంశాలలోఅప్డేటెడ్‌గా ఉండాలన్నారు.బాగా చదువుకొని ఎంచుకున్న రంగాల్లో సమున్నతంగా రాణించి రాబో యే జూనియర్లకు ఆదర్శంగా నిలవాలన్నారు. హాస్టల్లో కొత్త డైట్ ప్లాన్ అమలవుతోందా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కళాశాలకుచెందిన విద్యార్థులు కళాశాలలోనే మిల్కీ వైట్ మష్రూమ్ పండించడాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. ఇటువంటి ప్రయోగాత్మక విధానాలను ఇంకా ముందుకు తీసుకువెళ్లాలని ప్రోత్సహించారు.కలెక్టర్ వెంట డిఆర్డిఓ ఉమాదేవి, మైనారిటీ శాఖ అధికారి అఫ్జలుద్దీన్, ఆయా గురుకులాల ప్రిన్సిపాల్‌లు సరస్వతి, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

## పశువులు మేపిన బాలుడి విజయం

### -కలెక్టర్ చేతుల మీదుగా సత్కారం


పరమేష్‌ను సత్కరించి అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై4 ప్రభాతవార్త:** పశువులను మేపుతూ కూడా చదువుపై చూపిన అతని అంకితభావం అమోఘమని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బాల కార్మికుడిగా ఉంటూ పీహెచ్‌డీ పట్టా సాధించిన పరమేష్‌ను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అభినందించారు. నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలంలోని కొండనాగుల గ్రామానికి చెందిన పరమేష్ కార్మికుడిగా ఉంటూ 14 ఏళ్లకు పాఠశాలలో 7వ తరగతి చేరి బ్రిడ్జి కోర్స్ పద్ధతిలో విద్య నభ్యసించి పీహెచ్‌డీ సాధించిన సందర్భంగా శుక్రవారం నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నాగర్‌కర్నూల్ కలెక్టరేట్లో కలిశారు. అనంతరం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరమేష్‌ను అభినందించి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ చదువు నుంచి దూరంగా ఉన్న యువతకు పరమేష్ ఒక స్ఫూర్తిదాయక వ్యక్తిగా నిలుస్తున్నారని, అతని విద్యా జీవితం ఎంతో మందికి మార్గదర్శకమవుతుందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. పశువుల కాపరిగా ఉంటూ 14 ఏళ్ల తర్వాత నేరుగా 7వ తరగతికి పాఠశాలలో చేరి నేడు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేయడం జిల్లాలోని చదువుకు దూరంగా ఉంటూ చదువుకోలేకపోతున్నామని యువతకు స్ఫూర్తిగా నిలిచాడని కలెక్టర్ ఈ సందర్భంగా కొనియాడారు. చదువుకు దూరంగా ఉన్న యువతను సైతం మార్గనిర్దేశించగల శక్తి పరమేష్ కలిగి ఉన్నాడని, అతని జీవన ప్రయాణం వారికి స్ఫూర్తిగా నిలుస్తుందని, పశువులు మేపుతూ జీవితం గడిపిన యువకుడు... నేడు డాక్టరేట్ సాధించి ఎంతో మంది యువతకు స్ఫూర్తిగా నిలిచాడు. అతని అంకితభావాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అభినందించారు. అవకాశాలు అన్వేషిస్తే ప్రతిభ బయటపడతుంది,పరమేష్ జీవితం అందుకు నిలువెత్తు ఉదాహరణ అంటూ కలెక్టర్ ప్రశంసలు కురిపించారు. జిల్లాలో చదువుకు దూరంగా ఉంటున్న యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవడం వారికి జిల్లాలో విద్యాపరంగా విద్యార్థులకు ప్రేరణ తరగతులను అందించేందుకు అయినా సేవలు వినియోగించుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. అంతకుముందు పరమేష్ పశువుల కాపరి నుండి పీహెచ్‌డీ సాధించేవరకు తన ఎదుగుదలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు.

## ఘనంగా ఠాగూర్ మెమోరియల్ స్కూల్ కరస్పాండెంట్ జన్మదిన వేడుకలు


పాఠశాల చిన్నారుల నడుమ జన్మదిన వేడుకలు జరుపుతున్న గొడుగు వెంకటయ్య

**భూత్పూర్, జూలై4,ప్రభాతవార్త:** భూత్పూర్ ఠాగూర్ మెమోరియల్ స్కూల్ కరస్పాండెంట్ గొడుగు వెంకటయ్య 67వ జన్మదిన వేడుకలు శుక్రవారం పాఠశాలలో స్కూల్ విద్యార్థులు,ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు.పిల్లల మధ్యే తన జన్మదిన వేడుకలు జరపాల ని నిర్ణయించుకున్న వెంకటయ్యను చిన్నారులు ఆప్యాయతల నడుమ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కాడ్లూర్ చాముండేశ్వరి,ఉపాధ్యాయురాళ్లు సన,రహీమా, సృష్టి,మాధవి, వినిత్ తదితరులు స్వీట్లు పంచిపెట్టి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులుచైత్ర,అక్షర,అమూల్య, రిషిత,కార్తీక, హర్షిక, అక్షిత,రవళి, సహస్ర ,సంజీవ,భరత్,ప్రణీత్‌కుమార్‌లు తమ కరస్పాండెంట్ గొడుగు వెంకటయ్యకు స్వీట్లు తినిపించి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**ఉట్కూరు, జూలై 4 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల్లో 2009 విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఊట్కూర్ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2009 విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాలకు కేటాయించి ఉచితంగా విద్యను అందించాలని పేర్కొన్నారు. 25 శాతం విద్యార్థుల ఫీజులను ప్రభుత్వం ప్రైవేటు పాఠశాల యాజమాన్యానికి నిధుల రూపంలో కేటాయించాలని అన్నారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాల యజమాన్యం ఇష్టారీతిన ఫీజులను రాబడుతుందని ఆరోపించారు. గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలలను రద్దు చేయాలని కోరారు. విద్యారంగ సమస్యలపై జిల్లాలోని విద్యార్థి సంఘాలు కలిసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రాథమిక సౌకర్యాల కోసం రూ. కోటి 28 లక్షల 60 వేల నిధులు మంజూరు

### డిఐఈఓ ఎర్ర అంజయ్య

**వనపర్తి, జూలై 4 ప్రభాతవార్త :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాథమిక సౌకర్యాల కోసం ఒక కోటి 28 లక్షల 60 వేల నిధులు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వైట్‌వాష్, మైనర్ సివిల్ మరమ్మతులు, విద్యుత్, గ్రీన్ బోర్డులు, డ్యూయల్ డెస్కులు మొదలైన ప్రాథమిక సౌకర్యాలను అందించడం కోసం, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృష్ణ ఆదిత్య ఒక కోటి 28 లక్షల 60 వేల రూపాయలు మంజూరు చేసినట్లు ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి ఎర్ర అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్య యొక్క జిఓఎంఎస్‌నం.5 తేదీ: 12.03.2024లో నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పైన పేర్కొన్న పనులను ఎపిసిల ద్వారా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి టిజిఇడబ్ల్యుఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని మొత్తం 12 ప్రభుత్వ కళాశాలలకు నిధులు మంజూరైనట్లు తెలిపారు.

## రికార్డుల పరిశీలన

**ఉప్పునుంతల, జూలై 4 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రికార్డులను శుక్రవారం మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. గ్రామపంచాయతీకి సంబంధించిన అన్ని రకాల అధికారులను తనిఖీ చేశారు. అదేవిధంగా నర్సరీ నీ సందర్శించి వనమోత్సవం కోసం పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని పంచాయతీకార్యదర్శి సూచించారు.దీంతో పాటు డంపింగ్ యార్డ్‌ను సందర్శించి రసాయనిక ఎరువుల తయారీ కేంద్రం వద్ద కొంత సేపు పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌తో గ్రామపంచాయతీకిసంబంధించిన వివరాలనుఅడిగి తెలుసుకున్నారు.మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, పంచాయతీకార్యదర్శి వెంకటేష్,గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతులు లేని ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేసిన జిల్లా వైద్యాధికారి


ఆసుపత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

**నారాయణపేట టౌన్, జూలై 4 ప్రభాతవార్త :** నారాయణపేట మండలంకోటకొండ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్టర్ కాకుండ నడుపుతున్న ప్రైవేటు క్లినిక్‌ను ఆకస్మికంగా గురువారం సందర్శించి అక్కడ అర్హతకు మించి వైద్యం చేయడాన్ని గమనించి నిర్వాహకులకు హెచ్చరించి రోగులను ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి సీజ్ చేయడం జరిగింది. ఎంబీబీఎస్ అర్హత కలిగిన డాక్టర్లను నియమించుకొని రిజిస్టర్ చేసుకున్న తర్వాతనే నిబంధనలకు అనుగుణంగా వైద్యం నిర్వహించాలని సూచించడం జరిగింది. అంతకు ముందు అమ్మిరెడ్డిపల్లి ఉపకేంద్రాన్ని సందర్శించి ఫ్రైడే ఆక్టివిటీని పరిశీలించి గ్రామంలో పరిశుభ్రత ఉండేలా సీజన్లో వచ్చే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా ప్రజల కు అవగాహన కల్పించాలని ఎమ్ఎల్‌హెచ్‌పి డా. చందనను ఆదేశించడం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో పాటు జిల్లా ఎన్సిడి కోఆర్డినేటర్ విజయ్ కుమార్ ఉన్నారు.

### కడవరకు కార్యకర్తలతోనే

## వారే నా బలం..నా బలగం

**వనపర్తి ప్రతినిధి, జూలై4 ప్రభాతవార్త:** కడవరకు కార్యకర్తలతోనే ఉంటానని, వారే నా బలం, బలగం అని వనపర్తి శాసన సభ్యులు తుడి మెగారెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. అనంతరం వనపర్తి మండలానికి కేటాయించిన ఆర్టీసీ బస్సులో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులతో కలసి హైదరాబాదులో జరిగే గ్రామ అధ్యక్షుల సమ్మేళన బహిరంగసభకు ఆర్టీసి బస్సులో బయలుదేరారు.


ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే

## మహబూబ్‌నగర్ ఫస్ట్ భేష్

### టాస్క్ సిఇవో శ్రీకాంత్ సిన్హా కితాబు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 4 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ ఫస్ట్ కార్యక్రమాలు చాలా బాగున్నాయి అని టాస్క్ సిఇవో శ్రీకాంత్ సిన్హా అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని బికె రెడ్డి కాలనీలోమహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ సెంటర్‌ను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ సెంటర్‌లో ఇస్తున్న నైపుణ్య శిక్షణ తరగతులను వారు ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తన సొంత నిధులతో నిరుద్యోగుల కోసం ఒక స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడం అంతే కాకుండా ప్రముఖ విద్యాసంస్థలను మహబూబ్‌నగర్‌కు తీసుకువచ్చి, విద్యాభివృద్ధికి, నైపుణ్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం అని వారన్నారు. మహబూబ్ నగర్ ఫస్ట్ కేంద్రంలో నిర్వహిస్తున్న కోర్సుల వివరాలను మహబూబ్ నగర్ ఫస్ట్ ఇంచార్జిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులుబెజ్జుగంరాఘవేంధర్, ఇంచార్జీ నిజలింగప్ప పాల్గొన్నారు.

## జ్యోతిబా పూలే, గురుకుల పాఠశాల తనిఖీ

మొదటి పేజీ తరువాయి భాగం..

తెలపగా అందుకు తగ్గట్టు సాధన చేయాలని కలెక్టర్ తెలిపారు. తరగతి గదులను పరిశీలించిన తర్వాత అదనపు గదులను నిర్మించాలని మరోసారి భవన యాజమానికి కలెక్టర్ సూచించారు. పాఠశాలలోని వంట సామాగ్రి, బియ్యం బస్తాలను, వంటగదిని ఆమె పరిశీలించారు. మెనూను తప్పక పాటించాలని ఆదేశించారు. వారానికి ఎన్ని సార్లు నాన్ వెజ్ ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికంగా గల సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాల/ కళాశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆ పాఠశాల ప్రిన్సిపల్ నాగమణి మాలతో పాఠశాల/ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థినుల సంఖ్యా వివరాలను తెలుసుకున్నారు. ఇతర మౌలిక వసతి సదుపాయాలు ఏమేమి ఉన్నాయని ప్రశ్నించారు. సుమారు 650మంది విద్యార్థినులు ఉన్నారని, చిన్నచిన్న సమస్యలు తప్పామిగతా ఏమీ లేవని ప్రిన్సిపల్ తెలిపారు.ఇంటర్ తరగతి గదికి వెళ్లిన కలెక్టర్ ఎలా చదువుతున్నారని,మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థినులకు సూచించారు. డిజిటల్ తరగతిగదిని, పాఠశాల ఆవరణలోని కిచెన్ గార్డెన్‌ను ఆమె పరిశీలించారు. పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరీ ఎత్తు ఎక్కువ లేకపోవడం కొంత సమస్యగా మారుతోందని ఎత్తు పెంచి నిర్మింప చేస్తే సమస్య ఉండదని ప్రిన్సిపల్ కలెక్టర్‌కు తెలిపారు.తర్వాత డైనింగ్ హాల్‌కు వెళ్ళి మెస్ రికార్డులను, మెనూచార్ట్‌ను కలెక్టర్ పరిశీలించారు.మోనును క్రమం తప్ప కుండా అమలు చేయాలని ఆదేశించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై సమావేశం

మొదటి పేజీ తరువాయి భాగం..

నిర్వహణకు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బంది, సమస్యాత్మక కేంద్రాలు గుర్తించడం జరిగిందని తెలిపారు. గతంలో 140 ఎంపీటీసీ స్థానాలు ఉండగా మద్దూరు మున్సిపాలిటీ కావడంతో ఆ స్థానాలు 136 కు తగ్గాయని చెప్పారు. అలాగే గత సర్పంచి ఎన్నికలలో జిల్లాలో మొత్తం 280 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రస్తుతం మద్దూరు మున్సిపాలిటీ గా ఏర్పడంతో వాటి సంఖ్య 136 కు తగ్గిందని డీపీవో సుధాకర్ రెడ్డి తెలిపారు. సమావేశంలో ఎన్నికల ట్రైనర్ పవర్ పాయింట్ ప్రజెంటెన్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిననియమ నిబంధనలు,నామినేషన్ల ప్రక్రియ, పరిశీలన, ఉపసంహరణ తదితర అంశాల గురించి క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా ఎన్నికల నిర్వహణ కు అన్ని ఏర్పాట్లను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకుని ఉండాలని సూచించారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని శ్రీ దత్త బృందావన్ కళాశాల లో ఎన్నికల సామాగ్రి పంపిణీ, రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గాంగ్వర్, డీఆర్డీఓ మొగులప్ప, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

## కొమరయ్య పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం

మొదటి పేజీ తరువాయి భాగం..

వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో ముందుండి నడిపించి తెలంగాణ కొరకు పాటుపడిన దొడ్డి కొమరయ్య ను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి జయంతి, వర్ధంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం..బానిస బంధాల నుంచి విముక్తి కోసం..వెట్టి చాకిరి నిర్మూలన కోసం నడుం బిగించిన తొలి అమరుడని అన్నారు.పేదలను చైతన్యపర్చడంతో పాటు వెట్టిచాకిరికి వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య చూపిన సాహసం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రభుత్వం నుంచి బడుగు బలహీన వర్గాలకు అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లులక్ష్మినారాయణ, నర్సింగరావు, ఏ.ఓ. భూపాల్ రెడ్డి, ఈ.డి ఎస్సీ కార్పొరేషన్ నిషిత, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, జి.యం ఇండస్ట్రీస్ రామ లింగేశ్వర్ గౌడ్,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బూత్ లెవల్ అధికారులకు అవగాహన

**రాజాపూర్, జూలై 4 ప్రభాతవార్త:** ఎన్నికల కమిషన్ వారి నియమ నిబంధనలలో భాగముగా శుక్రవారం రాజాపూర్ మండల స్థాయిలో ఆయా గ్రామాల పోలింగ్ స్టేషన్లలోని బూత్ లెవల్ అధికారులకు అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులకు జిల్లా అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ సందర్శించి తగు సూచనలు సలహాలు చేశారు. ఈ ట్రైనింగ్‌లో ట్రైనర్స్, తహసీల్దార్ రాధాకృష్ణ, శ్రీనివాస్, సూపర్‌వైజర్స్,ఏఎస్ఓ శ్రీకాంత్, మంజుల, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక క్యాంపులు

**రాజాపూర్, జూలై4 ప్రభాతవార్త:** గిరిజనుల వికాసానికి, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి అమలు చేస్తున్న పి.ఎం. ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద జిల్లాలో గుర్తించిన 25 గిరిజన ఆవాసాలలో 25 జూన్ 2025 నుండి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.జనార్దన్ తెలిపారు. ఈ సధస్సులలో భాగంగా శుక్రవారం రాజాపూర్ మండలం లోని కుత్నేపల్లి, కొర్ర తాండ గ్రామములో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమములో వివిధ శాఖల అధికారులు పాల్గొని, జిల్లా గిరిజన మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వము ద్వారా ప్రకటించబడిన ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసి న్యాయ మహా అభియాన్, దర్తి ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకముల పై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె. జనార్ధన్, రాజాపూర్ ఎంపిడిఓ విజయ లక్ష్మి, ఎల్‌డిఎం కాల్వ భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు రాధ కృష్ణ, అనురాధ, ఎంపిఓ వెంకటేశ్వర్లు, ఎపిఎం రవికుమార్, ఏఈఓ మహేశ్వర్ ఎఎన్ఎం అధికారులు, గ్రామ పెద్దలు, లబ్దిదారులు పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.